


ఇదెట్టా..!

అన్నదాత సుఖీభవ ఇది రాష్ట్ర ప్రభుత్వ పథకం.. పీఎం కిసాన్ ఇది కేంద్ర ప్రభుత్వ పథకం. రెండు పథకాల లక్ష్యం ఒక్కటే అన్నదాతకు పెట్టుబడి సాయం అందించడం. ఇంత వరకు బాగానే ఉంది. లబ్ధిదారుల ఎంపికలో రెండు పథకాలకు పొంతన లేదు. ఒక పథకం జాబితాలో ఉన్న లబ్ధిదారులు.. మరో పథకం జాబితాలో లేరు. పీఎం కిసాన్ పథకం కింద రూ.2 వేలు నగదు జమ అయిన అన్ని ఖాతాలకు.. అన్నదాత సుఖీభవ సొమ్ము రూ.5 వేలు జమ కాలేదు. ఇదే పరిస్థితి అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారులది. పీఎం కిసాన్‌లో అర్హత ఉంటే.. సుఖీభవకు ఎలా అనర్హులం అవుతామంటూ.. బాధితులు ప్రశ్నిస్తున్నారు. సుఖీభవ పొందిన తమకు.. పీఎం కిసాన్ ఎందుకివ్వరని సదరు రైతులు నిలదీస్తు న్నారు. ఇలాంటి లబ్ధిదారులు వందల్లో ఉంటే ఎక్కడో పొరపాటు జరిగిందని భావించవచ్చు. ఈ సంఖ్య వేలల్లో ఉంది.





పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల్లో వ్యత్యాసం

- రెండు పథకాలు.. లక్ష్యం రైతుకు పెట్టుబడి సాయం
- కేంద్ర జాబితాలో ఉన్న లబ్ధిదారులు.. రాష్ట్ర జాబితాలో లేరు
- రూ.5 వేలు పడిన వారికి రూ.2 వేలు పడలేదు..
- రెండు పథకాల మధ్య తేడా 68,864 వేల మంది రైతులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల్లో.. ఒక దానికి లబ్ధి చేకూరి, మరో పథకం వర్తించని రైతులు.. రైతు సేవా కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కానీ, వారి సందేహాలను నివృత్తి చేసే వారు కానరావడం లేదు. రెండు పథకా లకు ఒకే లబ్ధిదారుల జాబితా లేదని అధికారులు చెప్పకనే చెబుతున్నారు. పీఎం కిసాన్ పథకానికి 2019 వెబ్ ల్యాండ్ ప్రకారం లబ్ధిదారులను గుర్తించారని, సుఖీభవ పథకానికి 2005 జూన్ నాటి వెబ్ ల్యాండ్ ప్రకారం లబ్ధిదారుల ఎంపిక జరిగిందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

మూడు జిల్లాల్లో బాధితులు ఇలా..

పల్నాడు జిల్లాలో 37,681, బాపట్ల జిల్లాలో 17,241, గుంటూరు జిల్లాలో 13,942 మంది రైతులు పీఎం కిసా న్‌ను కోల్పోయారు. మూడు

(మిగతా 6వ పేజీలో)

జిల్లాల వారీగా అన్నదాత సుఖీభవ.. పీఎం కిసాన్ లబ్ధిదారులు ఇలా..

జిల్లా	సుఖీభవ లబ్ధిదారులు	పీఎం కిసాన్ లబ్ధిదారులు	వ్యత్యాసం
పల్నాడు	2,39,959	2,02,278	37,681
బాపట్ల	1,60,441	1,43,200	17,241
గుంటూరు	1,02,650	88,708	13,942

ఈకేవైసీ మతలబు ఏమిటో?

ఈకేవైసీ కాలేదని, ఇంటి మ్యాపింగ్ జరగలేదని, 1బీ నమోదు కాలేదని తదితర అంశాలతో అర్హులైన రైతుల పేర్లను అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల జాబితా నుంచి అధికారులు తొలగించారు. ఇక్కడ తొలగించిన లబ్ధిదారులకు పీఎం కిసాన్ పథకం వర్తించింది. వీరి బ్యాంకు ఖాతాలకు రూ.2 వేలు జమ కావడం గమనార్హం. ఈకేవైసీ పీఎం కిసాన్ పథకానికీ ఉంది. అయితే అక్కడ ఉన్న ఈకేవైసీ.. సుఖీభవకు ఎందు కాలేదు.? రెండు ఈకేవైసీలు ఒకటి కాదా అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. మ్యాపింగ్ అయిన లబ్ధిదారులకు కూడా సుఖీభవ వర్తించ లేదు. ఇలాంటి వారు కూడా వేలల్లోనే ఉన్నారు.



రోడ్డెక్కిన మురుగు

సైడు కాల్వల కబ్జాతో కష్టాలు

పిడుగురాళ్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాల్వల్లో పారాల్సిన మురుగు నీరు రోడ్డెక్కింది. మురుగుతో పాదచారులు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. కాల్వల కబ్జాతో ఈ పరిస్థితి నెలకొన్నా అధికారులకు పట్టడంలేదు. ఈ దురవస్థ పిడుగురాళ్ల పట్టణంలో తీవ్రంగా ఉంది. ప్రధాన రహదారికి పక్కనే ఉన్న సైడు కాల్వలను ఎక్కడికక్కడే దుకాణదారులు, ఇళ్ల యజమానులు ఆక్రమించేశారు. దీంతో కాల్వల్లో పేరుకుపోయిన చెత్తా చెదారం తీసేందుకు వీలు పడకపోవడంతో పారుదల లేని వర్షపునీరు అంతా అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపైకి చేరుతుంది. మంగళవారం పట్టణంలో గంట సేపు కురిసిన భారీ వర్షానికి సినిమా హాలు సెంటర్ నుంచి ఓవర్ బ్రిడ్జి వరకు వర్షపు నీటితో కలిసి మురు గునీరు రోడ్డును ముంచెత్తింది. ఓవర్ బ్రిడ్జి సమీపంలో తండా బజారుకు వెళ్లే మార్గంలో సైడు కాల్వను ఆక్రమించి ఓ భవంతినే నిర్మించారు. దీంతో వర్షపునీరు పోయే మార్గం లేకుండా పోయి ఆ ప్రాంత మంతా జలమయంగా మారింది. కాల్వల ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకోకుంటే ప్రజాశక్తినగర్, తండా బజారు, ఓవర్ బ్రిడ్జి ప్రాంతం, తహ సీల్దార్, మున్సిపల్ కార్యాలయ నూతన భవనం తదితర ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు.



అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై నిలిచిన వర్షపు నీరు

జియో ట్యాగింగ్‌లో కచ్చితత్వం పాటించాలి

◆ ఎన్ఆర్ఈజీఎస్ జిల్లా ఫైనాన్స్ మేనేజర్ హీరాలాల్

క్రోసూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులకు సంబంధించి జియో ట్యాగింగ్, జియో ఫెన్సింగ్‌లో ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు కచ్చితత్వం పాటించాలని ఎన్ఆర్ఈజీఎస్ జిల్లా ఫైనాన్స్ మేనేజర్ హీరాలాల్ తెలిపారు. క్రోసూరు హైస్కూల్‌లో జరిగిన ఉపాధి శిక్షణా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పనులు జరిగే ప్రాంతాల్లో ప్రతి నాలుగు గంటలకు ఒకసారి 50 మీటర్లకు పరిధిలో జియో ట్యాగింగ్, జియో ఫెన్సింగ్ నమోదు చేసి ఫొటోలు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. జియో ట్యాగింగ్, జియో ఫెన్సింగ్ మొబైల్ యాప్ నిర్వాహణ గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. శిక్షణా కార్యక్రమంలో ఎంపీడీవో రవికుమార్, సత్తెనపల్లి ఇన్‌చార్జ్ ఏపీడీ వెంకటనారాయణ, జేఈ రమణమూర్తి, ఈసీ హరిత, టెక్నికల్ అసిస్టెంట్లు వెంకట స్వామి, చిరంజీవి, ఏపీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. క్రోసూరు, అచ్చంపేట, అమరావతి, బెల్లంకొండ, పెదకూరపాడు మండలాలకు చెందిన ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారు.



నారికేళి అలంకరణలో కనకదుర్గమ్మ

భవానీనగర్‌లో వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మ వారిని శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకొని కొబ్బరి కాయలతో విశేష అలంకరణ గావించారు. భక్తులు, దేవాలయ కమిటీ సభ్యులు అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- పిడుగురాళ్ల



పట్టుకోండి చూద్దాం..

పోలీసులకు దొంగల సవాల్ ● ఆరు నెలల్లో 267 చోరీల నమోదు

- పెరుగుతున్న చోరీలు.. నిఘా నిద్ర
- జిల్లాలో కనిపించని పోలీసు బీట్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పోలీసులు బీట్లు మరిచారు. నిఘా నిద్రావస్థలో ఉంది. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంలో విఫలంతో జిల్లాలో దొంగలు చెలరేగిపోతున్నారు. జిల్లాలో గత ఆరు నెలల కాలంలో 267 దొంగతనాలు జరిగినట్లుగా వివిధ పోలీసు స్టేషన్లలో అధికారికంగా కేసులు నమోదయ్యాయి. ఇక నమోదు కాని, పోలీసుల దృష్టికి రాని చోరీలు ఎన్ని ఉంటాయో తెలియాల్సి ఉంది. పెద్దఎత్తున దొంగతనాలు జరుగుతున్నా పట్టుబడు తుంది కొందరే కాగా.. అరకొరగానే చోరీ సొత్తు స్వాధీనం చేసుకోవడంతో సరిపెడుతున్నారే కానీ దొంగతనాలను అరికట్టడం పై పోలీసులు దృష్టి సారించడంలేదన్న విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. జిల్లాలో రోజూ ఏదో ఒక మూలన చోరీ ఘటనలు వెలుగుచూస్తూనే ఉన్నాయి. పట్టణం.. పల్లె అన్న సంబంధం లేకుండా ఇల్లు.. దుకాణం అన్న తేడా లేకుండా చోరీలకు పాల్ప డుతున్న దొంగలు పట్టుకోండి చూద్దాం అన్నట్లుగా పోలీసులకు సవాల్ విసురుతున్నారు. బాధితుల ఫిర్యాదులతో కేసులు నమోదు చేస్తున్న పోలీసులు విచారణలో మాత్రం ఆశించిన స్థాయిలో పురోగతి చూపడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇతర రాష్ట్రాలకు చెందిన ముఠాలు జిల్లాలో చోరీలకు (మిగతా 6వ పేజీలో)



రెంటచింతలలో చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

మృతులకూ.. రేషన్



- కార్డుల్లో తొలగించని పేర్లు
- ప్రహసనాన్ని తలపిస్తోన్న ఈ-కేవైసీ
- అనర్హులు లబ్ధి పొందుతున్నా పట్టని అధికారులు

రేషన్ సరుకులు.. అర్హులకు మాత్రమే అందాలి. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా సరుకుల పంపిణీలో గోల్‌మాల్‌తో పాటు ప్రజా ధనం పెద్దమొత్తంలో వృథా అవుతోంది. జిల్లాలో రేషన్ లబ్ధిదారుల్లో మృతులు ఉన్నారంటే ఆశ్చర్యం కాదు. ఇక ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్థికంగా స్థితిమంతులు, పెళ్లి చేసుకుని వెళ్లిపోయిన వారు.. ఇలా ఎందరో ఇప్పటికీ రేషన్ కార్డుల్లో ఉన్నారు. వీరందరూ నెలనెలా ఠంచనుగా రేషన్ సరుకులు పొందుతుండటంతో ప్రభుత్వంపై పెనుభారం పడుతోంది. దీనిని అడ్డు కోవాల్సిన అధికారులు పట్టీ పట్ట నట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఈ-కేవైసీ పక్కాగా అమలు చేస్తే అనర్హులను కార్డుల్లో నుంచి తొలగించవచ్చు. కానీ మూడు నెలలుగా ఈ-కేవైసీ ప్రక్రియను అధికారులు ఓ ప్రహసనంగా మార్చేశారు. ప్రభుత్వం గడువు పొడిగించు కుంటూ వెళ్తుండటంతో ఈ-కేవైసీ నూరు శాతం జరగడంలేదు. ఇదే అవకాశంగా డీలర్లు రేషన్ సరుకులను పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అర్హులకు మాత్రమే రేషన్ ఫలాలు అందడంతో పాటు బియ్యం పక్కదారి పట్టడానికి వీలులేదన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే క్షేత్రస్థాయిలో ఇందుకు పూర్తి విరుద్ధంగా పరిస్థితులు ఉంటున్నాయి. ఈ-కేవైసీ ప్రక్రియ నత్తనడకనే సాగుతుండటంతో అర్హత లేకపోయినా పలువురు లబ్ధి పొందుతున్నారని సమాచారం. ప్రజాధనం వృథాకు అడ్డుకట్ట పడాలంటే ఈ-కేవైసీతో పాటు క్షేత్రస్థాయి సర్వేతోనే సాధ్యపడుతుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవు తున్నా.. అధికారులు పట్టించు కోవడం లేదన్న విమర్శలు

(మిగతా 6వ పేజీలో)

అనర్హులతో.. రూ.3 కోట్ల వ్యయం

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో దాదాపు రెండున్నర లక్షల మంది అర్హత లేకపోయినా రేషన్ ఫలాలు అందుకుంటున్నట్లు తెలుస్తోంది. దాదాపు 21 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వం మూడు జిల్లాల పరిధిలోని కార్డుదారుల కోసం కేటాయిస్తుంది. ఇందుకు సగటున రూ.వంద కోట్ల వరకు ప్రభుత్వం ఖర్చు పెడుతోంది. కానీ అనర్హులు రేషన్ లబ్ధి పొందుతుండడం వల్ల ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.3 కోట్లు అదనంగా ఖర్చవుతున్నట్లు తెలుస్తోంది.

అక్రమంగా 24 ఎకరాలు ఆన్‌లైన్

- కేసానుపల్లిలో తహసీల్దారు విచారణతో వెలుగులోకి..

దాచేపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అధికారుల అవినీతి.. రాజకీయ ఒత్తిళ్లతో ప్రభుత్వ భూములు మాయమయ్యాయి. వందల ఎకరాలు దక్కించుకున్న వారు వాటిని విక్రయించి, బ్యాంకుల్లో తాకట్టు పెట్టి లబ్ధి పొందారు. తాజాగా అధికారుల విచారణలో భూ అక్రమాలు పెద్దఎత్తున వెలుగుచూస్తున్నాయి. రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు ప్రభుత్వ భూములు అక్రమంగా, ఇష్టానుసారంగా వ్యక్తులకు ధారాదత్తం చేశారన్న ఆరోపణలు అధికారుల విచారణలో తేటతెల్లమైంది. కేసానుపల్లిలో మంగళవారం అధికారులు రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. కేసానుపల్లి రెవెన్యూ శివారు గ్రామమైన తక్కెళ్లపాడులోని ఊరబీడు లో 24 ఎకరాలు ప్రభుత్వ భూములను 13 మంది వ్యక్తులు వెబ్ ల్యాండ్‌లో అక్రమంగా నమోదు చేసుకున్నట్లు గుర్తించారు. వాస్తవాల ను తెలుసుకునేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వ్యక్తులను పిలిపించి వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లను అధికారులు పరిశీలించారు. గత వైసీపీ పాలనలో అధికారులను ప్రలోభ పెట్టి కొంతమంది బీడు, కుంట పొలాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నట్లు రెవెన్యూ అధికారుల ప్రాథమిక విచారణలో తేల్చారు. ఇప్పటికే పొందుగల, తంగెడ గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్న వ్యక్తులను విచారించారు. వారి వద్ద ఉన్న డాక్యుమెంట్లను కూడా అధికారులు పరిశీలించారు. పూర్తి స్థాయి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని, తదుపరి చర్యలు ఉన్నతాధికారులు నిర్ణయిస్తారని కార్యాలయ సిబ్బంది తెలిపారు.



విచారణ చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

ఉద్యాన సాగుకు ప్రోత్సాహం

20 రకాల పండ్ల తోటలకు రాయితీలు

శావల్యాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన లాభాలు చేకూరే ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నదని జిల్లా ప్లాంటేషన్ అధికారి శిరీష తెలిపారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఫీల్డ్‌అసిస్టెంట్ల శిక్షణ జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రైతులు ఉద్యాన పంటల సాగుకు ముందుకు రావాలన్నారు. ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు అనేక రాయితీలను అందిస్తున్నారు. ఉపాధి పథకం ద్వారా 20 రకాల పండ్ల తోటలకు రాయితీలు అందుతుందన్నారు. ఐదెకరాలలోపు పొలం, జాబ్‌కార్డులున్న రైతులంతా ఇందుకు అర్హులన్నారు. గులాబీ, మల్లె తోటలకు కూడా రాయితీలు వర్తిస్తాయన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో మునగ, డ్రాగన్ ఫ్రూట్, యాపిల్ సాగు చేసుకోవచ్చన్నారు. అమరావతి, రాజుపాలెం, బెల్లంకొండ, పిడుగురాళ్ల, నాదెండ్ల, సత్తెనపల్లి, ఈపూరు మండలాల్లో ఆయిల్‌ఫాం తోటలకు అనుమతులు వచ్చాయన్నారు. త్వరలో వినుకొండ, నూజెండ్ల, శావల్యాపురం మండలాలకు అనుమతులు వస్తాయన్నారు. ఎకరాకు ఆయిల్‌ఫాం సాగుకి రూ.57 వేలు, మామిడికి రూ.1 లక్ష, తైవాన్‌జామకి రూ.2 లక్షలు, మునగకు రూ.1 లక్ష, మల్లె, గులాబితోటలకు రూ.2 లక్షలు చొప్పున రాయితీలు విడతల వారీగా అందిస్తామన్నారు. మామిడి, సపోట, నిమ్మ, బత్తాయి, జామ, దానిమ్మ, యాపిల్, డ్రాగన్, అంజూర, సీతాఫలం తోటలకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు.

క్రీడాదినోత్సవ పోటీలకు 7న ఎంపికలు

గుంటూరు (క్రీడలు) ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని 7వ తేదీ జిల్లాస్థాయి క్రీడా ఎంపికలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి పి.నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభను చూపిన క్రీడాకారులను త్వరలో జరగనున్న జోనల్ పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. 22 ఏళ్లలోపు క్రీడాకారులకు మొత్తం పది క్రీడాంశాల్లో వివిధ ప్రాంతాల్లో పోటీలకు జరుగుతాయని తెలిపారు. క్రీడాంశాలకు సంబంధించి సూచించిన క్రీడా శిక్షకులను సంప్రదించాలని పేర్కొన్నారు. హాకీ-శివారెడ్డి 80965 31992(ఏఎన్‌యూ), ఆర్చరీ గోపీ 94419 47974(డీఎస్ ఏ స్టేడియం పొన్నూరు) బ్యాడ్మింటన్, బాక్సింగ్ లోహిత్ 81443 96583(బీఆర్ స్టేడియం,గుంటూరు) బాస్కెట్ బాల్ సుకన్య 78932 94806(అంకిరెడ్డిపాలెం) కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, శివాజీ 98497 03144(టీజేపీఎస్) వెయిట్ లిఫ్టింగ్ గోపి 93922 57919(డీఎస్ఏ స్టేడియం,తెనాలి)లను సంప్రదించాలని తెలిపారు. క్రీడాకారులు ఆధార్, వయసు ధ్రువీకరణ, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో ఎంపికలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

బోఫోర్స్ కంటే పెద్ద స్కామ్: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): జగన్ మద్యం స్కాం బోఫోర్స్ స్కాం కంటే చాలా పెద్దదని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలే పెట్టుబడిగా వ్యాపారం చేసి కోట్లు దోచేసిన వారు నిస్సిగ్గుగా అమాయకులమంటున్నారని తెలిపారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యమిచ్చే చంద్రబాబుకు, విషపూరిత మద్యంతో ప్రాణాలు తీసిన జగన్‌కు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. మద్యం సహా ల్యాండ్, శాండ్, సిలికా, క్వార్ట్జ్ ఇలా ప్రకృతి సంపదను, ప్రజల, ప్రభుత్వ ఆస్తుల్ని యథేచ్ఛగా దోచేసిన జగన్, ఆయన పార్టీ నేతలు ఇప్పటికీ చింతచచ్చినా పులుపు చావలేదన్నట్లే మాట్లాడుతున్నారని తెలిపారు. మద్యం కుంభకోణం నిందితులు ఒక్కొక్కరు పట్టుబడుతున్నా.. సిట్ విచారణలో రోజుకో కొత్త కుట్రకోణం వెలుగుచూస్తున్నా వారు అమాయకుల్లా.. నటిస్తూ తమపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

తీవ్ర జ్వరంతో మహిళ మృతి

నాదెండ్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరు గ్రామానికి చెందిన కూరపాటి మల్లేశ్వరి అనే మహిళ తీవ్ర జ్వరంతో మృతి చెందింది. మూడు రోజుల క్రితం అనారోగ్యంతో ఆమెతో పాటు భర్త పుల్లయ్య నరసరావుపేట పట్టణంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. చికిత్స అందిస్తున్న తరుణంలో శ్వాస సంబంధిత సమస్య రావడంతో మల్లేశ్వరిని మరో వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం రాత్రి ఆమె మృతి చెందింది. ఈ విషయాన్ని గ్రామస్తులు జిల్లా వైద్య శాఖ అధికారి దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో ఆయన నరసరావుపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిని సందర్శించారు. అవయవాలు దెబ్బతినటం వల్ల ఆమె మృతి చెందిందని జిల్లా వైద్య శాఖ అధికారి గ్రామానికి చెందిన బండారుపల్లి సత్యనారాయణకు వివరించారు. ఈ విషయం పై వైద్యాధికారి సాయి శ్వేతను వివరణ కోరగా ఆమె వారం రోజులుగా జ్వరంతో బాధ పడుతూ గ్రామంలోని ఆర్ఎంపీ వద్ద చికిత్స పొందుతుందని, వైరల్ ఫీవర్‌తో చని పోయిందని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

రాజుపాలెం, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): గుటూంరు-మాచర్ల రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మంగళవారం మృతి చెందాడు. మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన రాపల్లి బాబు(35) వ్యతిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై పిడుగురాళ్ల వెళ్లి తిరిగి వస్తున్నాడు. మార్గం మధ్యలోని అనుపాలెం సమీపంలోకి వచ్చేసరికే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన బాబును చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సై వేణుగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తక్కెళ్లపాడు కల్యాణ మండపం వ్యవహారంలో..

ఎమ్మెల్యే నరేంద్ర తప్పేం లేదు

- గ్రామస్తులంతా వెళ్లి ఆయనకు వివరిస్తేనే పరిష్కారం చేసుకోమని చెప్పారు
- కల్యాణ మండపం యజమాని రాంబాబు వెల్లడి



విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తున్న తక్కెళ్లపాడు టీడీపీ నాయకులు

పెదకాకాని, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తక్కెళ్లపాడు కల్యాణ మండపం వ్యవహారంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తప్పేం లేదని, గ్రామస్తులంతా వెళ్లి ఆయనకు వివరిస్తేనే పరిష్కారం చేసుకోమని చెప్పారని పెదకాకాని మండలం తక్కెళ్లపాడు తెలుగుదేశం పార్టీ నాయకులు తెలిపారు. ఆంధ్రజ్యోతి రాష్ట్ర ప్రధాన సంచికలో ఈ నెల 3న "వామ్మో.. ఆ ఎమ్మెల్యే.. దందాలతో దడ " అనే శీర్షిక కథనం వెలువడిన విషయం తెలిసిందే. మంగళవారం దీనిపై తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన బ్యాంక్ ఆక్షన్ వ్యవహారంపై.. కల్యాణ మండప యజమాని మోపర్తి రాంబాబు విలేకరుల సమావేశం నిర్వహించి, పూర్వాపరాలను వివరించారు. తక్కెళ్లపాడు గ్రామంలో తనకు చెందిన ఎకరం పొలంలో గ్రామంలోని పెద్దలు, మిత్రుల సలహా మేరకు 2019లో కల్యాణ మండపం నిర్మించడం జరిగిందన్నారు. ఆ కల్యాణ మండపం నిర్మించే సమయంలో కెనరా బ్యాంక్ గుంటూరు బ్రాడీపేట బ్రాంచ్‌లో రుణం తీసుకోవడం జరిగిందన్నారు. తదుపరి కరోనా విపత్తులో ఎలాంటి కార్యక్రమాలు జరగకపోవడంతో.. కల్యాణ మండపానికి సంబంధించిన బ్యాంకు కిస్తీలు సరిగా చెల్లించలేక.. బ్యాంకు ఆక్షన్ పెట్టడం జరిగిందన్నారు. ఈ ఆక్షన్‌లో బ్యాంకు సిబ్బంది.. సుబ్బారావు అండ్ టీంతో కుమ్మక్కయి తక్కువ మొత్తానికి కోట్ చేసి.. సుమారు రూ.3 కోట్ల ఆస్తిని రూ.1.80కోట్లకు వేలంలో దక్కించుకున్నట్లు తెలిపారు. అతి తక్కువకే కోట్ చేయడంతో బ్యాంకు అధికారులను సంప్రదించి తాను రూ.40 లక్షల బకాయిల చెల్లిస్తానని, ఆక్షన్ ఆపమని కోరినప్పటికీ.. తన మాట వినకుండా.. పాటదారులతో కుమ్మక్కు అవడంతో.. ఆక్షన్ నిర్వహించారని పేర్కొన్నారు. దీంతో తాను ఆత్మహత్యా యత్నం చేయగా కుటుంబ సభ్యులు అడ్డుకొని మిత్రులకు, గ్రామ పెద్దలకు తెలియజేయగా.. వారందరూ కలిసి పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్‌ని కలవడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే నరేంద్ర బ్యాంక్ ఆక్షన్ పాడుకునే వారితో మాట్లాడటం జరిగిందన్నారు. బ్యాంక్ ఆక్షన్ వారు భీమవరానికి చెందిన వారిగా గుర్తించి.. ఆ ఏరియాకు చెందిన మాజీ ఎమ్మెల్యే, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజుని సంప్రదించి ఈ విషయాన్ని పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. అప్పు ఇచ్చిన బాధితులు గ్రామస్తులతో కలిసి తాను రామరాజు ఆధ్వర్యంలో ఏపీఐఐసీ ఆఫీస్ నందు ఆక్షన్ పాడుకున్న వారితో మాట్లాడగా.. తాము ఆక్షన్‌లో పాడిన రూ. 1.80 కోట్లకు అదనంగా రూ.40 లక్షలు ఇస్తే తప్పుకుంటామని అంగీకారం తెలిపినట్లు వెల్లడించారు. ఆ తరువాత తాను ఆ మొత్తం వారికి చెల్లించి సమస్యను పరిష్కరించుకుందామని చూడగా రామరాజు అందుబాటులో లేక కొన్ని రోజులు గడవడం జరిగిందన్నారు. తరువాత ఆక్షన్ పాడుకున్నటువంటి సుబ్బారావు అండ్ టీం వారు ఏపీ ఐఐసీ చైర్మన్ రామరాజు మాట కూడా వినకుండా.. అడ్డం తిరిగి పాట పాడిన నగదు అదనంగా.. మరో రూ.కోటి 50 లక్షలు ఇస్తే తప్పుకుంటామనిమని పేచీ పెట్టారని తెలిపారు.

తాను మరొక ప్రయత్నంగా మండల పార్టీ నాయకులు తక్కెలపాడు, ఉప్పలపాడు గ్రామ నాయకులు అందరం కలిసి విజయవాడలోని ఓ హోటల్లో ఆక్షన్‌లో పాడిన సుబ్బారావు అండ్ టీం ని కలసి అదనంగా రూ.60 లక్షల వరకు ఇస్తామని అడిగినా.. అంగీకరించ లేదని తెలిపారు. కల్యాణ మండపాన్ని ఆనుకొని ఉన్న స్థలాన్ని తీసుకోమని తాము కోరగా.. ఆ స్థలం విలువ రూ.రెండు కోట్ల 50 లక్షలు ఉంటే వారు కేవలం రూ. 50 లక్షలకే అడిగారని తెలిపారు. ఈ ప్రయత్నాలన్నీ ఫలించకపోవటంతో శ్రేయోభిలాషుల సలహా మేరకు డీ ఆర్‌టీకి వెళ్లగా, దానికి సంబంధించి వాయిదా జరుగుతూ ఉందని తెలిపారు. ఈ సమావేశంలో తక్కెళ్లపాడు గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ మోపర్తి వేణు కుమార్, ఉప్పలపాడు ఎంపీటీసీ సభ్యులు మోపర్తి శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బుల్లెట్ సుశీల్ రావు, మాజీ ఎంపీటీసీ మోపర్తి సంజీవ్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు నందిపాటి ప్రసాద్, గ్రామపార్టీ అధ్యక్షులు ఆలపాటి సంపత్, లీగల్ సెల్ నాయకులు వలివేటి నాగేశ్వరావు, బైరపనేని లక్ష్మీనారాయణ, మాచవరపు మల్లికార్జునరావు, అయినంపూడి లింగయ్య, కాకర్ల సురేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్తమ సొసైటీలుగా పెదకాకాని, నూజెండ్ల



జ్ఞాపిక అందుకుంటున్న పెదకాకాని సొసైటీ కార్యదర్శి



అవార్డు అందుకుంటున్న నూజెండ్ల సొసైటీ చైర్‌పర్సన్

గుంటూరు సిటీ/నూజెండ్ల ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరిగిన ఆప్కాబ్ 62వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పెదకాకాని, నూజెండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు అవార్డులు దక్కాయి. గుంటూరు జిల్లాలోని పెదకాకాని పీఏసీఎస్‌కు 2023-2024లో రైతులకు మెరుగైన సేవలు, ఆర్థికంగా లాభాలు ఆర్జించినందుకు అవార్డు దక్కిన్నట్లు సొసైటీ కార్యదర్శి మొవ్వా వెంకటేశ్వరరావు తెలిపారు. ఉత్తమ పీఏసీఎస్‌గా నూజెండ్ల సొసైటీ అవార్డును సొసైటీ చైర్‌పర్సన్ బచ్చు అంజిరెడ్డి, సీఈవో గంగినేని శ్రీనివాసరావు అందుకున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.

పచ్చని కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసిన విషజ్వరం

- గంటల వ్యవధిలో భార్యాభర్తల మృతి
- అనాథలుగా మిగిలిన ఇద్దరు చిన్నారులు
- విషాదంలో ఈదుపల్లి గ్రామం



ఇద్దరు చిన్నారులు



చిన్నారులతో సుబ్బారావు, మహాలక్ష్మీ (ఫైల్‌పొటో)

రేపల్లె, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విషజ్వరాలతో దంపతులు మృతి చెందడంతో ఒక్కసారిగా ఈదుపల్లి గ్రామం ఉలిక్కిపడింది. నియోజకవర్గంలోని నగరం మండలం ఈదుపల్లి గ్రామానికి చెందిన తుమ్మల సుబ్బారావు కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. సుబ్బారావు అంత్యక్రియలైన కొద్ది గంటల్లోనే అతని భార్య మహాలక్ష్మి జ్వరంతో సోమవారం మృతి చెందింది. దీంతో వారి ఇద్దరు కుమార్తెలు అనాథలయ్యారు. తల్లిదండ్రులు చనిపోవడంతో చిన్నారుల రోదన గ్రామస్తులకు కంటతడిపెట్టించాయి. చిన్న వయసులోనే ఇంత పెద్ద కష్టం వచ్చిందంటూ..బాధపడ్డారు. ఈదుపల్లి గ్రామ పాఠశాలలోనే ఇద్దరు చిన్నారులు రెండు, మూడు తరగతులు చదువుతున్నారు. రోజుల వ్యవధిలోనే తల్లిదండ్రులు మృతి చెందిన చిన్నారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. మంగళవారం గ్రామంలో పరిస్థితులను తెలుసుకునేందుకు వచ్చిన కలెక్టర్ వెంకటమురళికి కుటుంబ సభ్యులు ఇదే విషయమై విజ్ఞప్తి చేశారు.

పట్టుకోండి చూద్దాం

(5వ పేజీ తరువాయి)

పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తిస్తున్నా వారిని పట్టుకోవడంలో విఫలమవుతున్నారు. ఒకప్పుడు పోలీసుల గస్తీలతో పాటు నైట్ బీట్లు నిర్వహించే వారు. ప్రస్తుతం ఇవి నామమాత్రమయ్యాయి. పట్టణాల్లో ద్విచక్ర వాహనాల చోరీలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. తాళాలు వేసిన ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. సీసీ కెమేరాల్లో ఆయా ఘటన దృశ్యాలు నమోదు అవుతున్నా నేరస్తులను పట్టుకుని సొత్తును రికవరీ చేయడంలో పోలీసులు పట్టీపట్టనట్లుగా ఉన్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాగి తీగ కోసం పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ధ్వంసం చేస్తున్నా పోలీసులకు పట్టడంలేదని రైతులు వాపోతున్నారు. రెంటచింతలలో ఓ ఉపాధ్యాయ దంపతులు ఇంటికి తాళం వేసి ఊరెళ్లగా ఆదివారం రాత్రి దొంగలు తాళాలు పగలకొట్టి 122 గ్రాముల బంగారం, పెద్దమొత్తంలో నగదు చోరీ చేశారు. గత వారంలో యడ్లపాడు మండలంలో కూడా ఇదే తరహాలో చోరీ జరిగింది.

పట్టుబడుతుసొకొందరే

జిల్లాలో గత ఆరు నెలల కాలంలో 267 దొంగతనాలు జరగ్గా 116 చోరీల(43.45 శాతం)ను మాత్రమే పోలీసులు చేధించారు. 3.11 కోట్ల బంగారం, వెండి, నగదు దొంగలు అపహరించగా 1.28 కోట్ల సొత్తు(41.30 శాతం)ను పోలీసులు రికవరీ చేశారు. చిలకలూరిపేటలో అత్యధికంగా 25 కేసులు నమో దయ్యాయి. డ్రోన్లు, సీసీ కెమేరాల ఏర్పాటు చేసినా వీటిని సద్వినియోగపరుచుకోవడంలో పోలీసులు విఫలమవడంతోనే చోరీలు పెరుగుతున్నాయన్న ఆందోళన నెలకొంది. నరసరావుపేటలో జరిగిన చోరీల్లో సగం కేసులను కూడా పోలీసులు చేధించలేదు. సాంకేతికంగా పోలీసు శాఖ ఎంతో పటిష్టంగా ఉన్నా దొంగతనాల అరికట్టడంలో, కేసులను ఛేదించడంతో విఫల మవుతున్నారన్న విమర్శలున్నాయి.

బ్యారేజీ దిగువకు 2,900 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల తగ్గడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుండి 19,878 క్యూసెక్కుల వరదనీరు మంగళవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్టు నీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 4 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 2,900క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. అలాగే తూర్పు డెల్టాకు 10,278 , పశ్చిమ డెల్టాకు 7713, గుంటూరు చానల్‌కు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల..పదోన్నతి ప్రక్రియ ప్రారంభం

- గ్రేడ్ -1, 2 కార్యదర్శుల సీనియార్టీ జాబితా సిద్ధం



సమావేశం లో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ జ్యోతి బసు

గుంటూరు సిటీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల పదోన్నతి ప్రక్రియ ప్రారంభమయ్యింది. అందులో భాగంగా గ్రేడ్-1, 2 పంచాయతీ కార్యదర్శుల సీనియార్టీ జాబితాను రూపొందించేందుకు మంగళవారం అధికారులు గుంటూరు జిల్లా పరిషత్‌లో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. జిల్లా పరిషత్ సీఈఓ వీర్ల జ్యోతి బసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉమ్మడి జిల్లాలోని గ్రేడ్-1, 2 పంచాయతీ కార్యదర్శుల సర్వీస్ రిజిస్టర్ ఆధారంగా సీనియారిటీ జాబితా రూపొందించారు. ఈ జాబితాను పంచాయతీ రాజ్ కమిషనర్‌కు పంపనున్నట్లు అధికారులు వెల్లడించారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగ సాయికుమార్, ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు పాల్గొన్నారు.

రేపు వీవర్‌శాలలో.. చేనేత దినోత్సవం

- హాజరుకానున్న సీఎం చంద్రబాబునాయుడు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి



వీవర్‌శాల వద్ద అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

మంగళగిరి సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవాలను గురు వారం మంగళగిరి ఆటో నగర్‌లోని వీవర్‌శాలలో జరుగనున్నాయి. ఈ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గాలు, వీవర్‌శాల వద్ద ఏర్పాట్లు, చేనేత కుటుంబాలతో సమావేశమయ్యే ప్రజావేదిక వద్ద ఏర్పాట్లపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యక్రమాల నిర్వహణ కోఆర్డినేటర్, శాసనమండలి సభ్యులు పెందుర్తి వెంకటేశ్వరరావు, సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవతేజ, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింగరావు, మంగళగిరి తహసీల్దారు దినేష్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టెయిల్‌పాండ్‌లో..

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

- పులిచింతలకు 29,894 క్యూసెక్కులు విడుదల

రెంటచింతల,ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.088 ఎంయూల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు ఎలక్ట్రికల్ ఈఈ సుబ్రహ్మణ్యం, ఏడీఈ గిరిబాబు తెలిపారు. 3 క్రస్ట్ గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 21258 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి అనంతరం టేల్‌రేస్ చానల్ ద్వారా 8,636 మొత్తంగా 29,894 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సాగర్ నుంచి 28,704 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.49 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.039 టీఎంసీలకు సమానమన్నారు. వారం నుంచి రెండు యూనిట్ల ద్వారా 13.95 ఎంయూల విదుత్ ఉత్పత్తి అయ్యిందన్నారు.

సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున ప్రాజెక్ట్ నీటిమట్టం మంగళవారం 587.20 అడుగులు ఉంది. ఇది 305.62 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5,088, ఎడమ కాలువ ద్వారా 8,541 , ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 28,542, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 44,271 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 44,271 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 44.18 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 28,159 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టు చేరతోంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, మొత్తం 17 వేల క్యూసెక్కులు దిగువకు విడుదలవుతోంది.

మృతులకూ.. రేషన్

(5వ పేజీ తరువాయి)

వస్తున్నాయి. అర్హులకు లబ్ధి చేకూరడం ఎంత ముఖ్యమో అనర్హుల ఏరివేత కూడా పక్కాగా ఉండాలని పాలకులు చెప్తున్నా క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోవడంలేదు. గత ప్రభుత్వం అనర్హుల ఏరివేతపై దృష్టి పెట్టకపోగా.. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి నెలకొంది. రాజకీయ సిఫార్సులే ప్రామాణికంగా రేషన్‌కార్డులను ఇబ్బడిముబ్బడిగా జారీ చేయడంతో జిల్లాలో ఇబ్బడిముబ్బడిగా కార్డుదారులు పెరిగిపోయారు. ఏటికేడు లబ్ధిదారుల సంఖ్యలో పెరుగుదల నమోదు కావడమే తప్ప తొలగించిన వారి సంఖ్య కనిపించదు. అయితే అర్హులు ఎందరో రేషన్ ఫలాలు అందుకోలేక పోతున్నారు. వారిని అధికారులు కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడంతో సరిపెడుతున్నారే కానీ కనికరించడం లేదు. బయోమెట్రిక్‌ను దుర్వినియోగిస్తూ కుటుంబంలో చనిపోయిన వారు ఉన్నా వారి సమాచారం ఇవ్వకుండా రేషన్ లబ్ధి పొందుతున్నవారూ ఉన్నారు.

విభాగాల మధ్య లోపం..

అనర్హుల ఏరివేత పక్కాగా జరగాలంటే జిల్లా పౌరసరఫరాల శాఖతో పాటు మండలాల పరిధిలోని రెవెన్యూ విభాగం కూడా సమన్వయంతో అడుగులేయాలి. క్షేత్రస్థాయిలో అది లోపించింది. మరణ ధ్రువీకరణ పత్రాన్ని వారి కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా అందిస్తే తప్ప రెవెన్యూ విభాగం మరణాలపై స్పందించడం లేదన్న విమర్శలున్నాయి. ఈ పత్రాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయగానే ఆటోమెటిక్‌గా వారి పేరు రేషన్ కార్డు నుంచి తొలగించబడుతుంది. కానీ ఈ పని అందరూ స్వచ్ఛందంగా చేయకుండా ఏళ్ల తరబడి లబ్ధి పొందుతూనే ఉన్నారు. సచివాలయ సిబ్బంది కూడా మరణాలపై దృష్టి పెట్టడం లేదు. పౌర సరఫరాల శాఖ ఈ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో అంతిమంగా ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతోంది.

ఇదెట్లా..!

(5వ పేజీ తరువాయి)

జిల్లాల్లో 68,864 మంది రైతుల ఖాతాలకు అన్నదాత సుఖీభవ తొలి విడద నగదు రూ.5 వేలు జమ కాలేదు. అలాగే పీఎం కిసాన్ పథకం లబ్ధి పొందిన వారు కూడా.. సుఖీభవకు దూరమయ్యారు. కూటమి ప్రభుత్వం ఏటా రూ.20 వేలు పెట్టుబడి సాయం అందిస్తానని హామీ ఇచ్చింది. రెండు పథకాల జాబితాలను పరిశీలించి.. అర్హులకు రెండు పథకాల సోమ్ము ఇచ్చేలా చర్యలు తీసుకుంటేనే.. ప్రభుత్వ హామీ నెరవేరుతుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

53,097 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 54,912 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 53,097 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,514 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	11000
334	9500	13500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13300	334	9500	12800
273	---	---	నెంబరు. 5	10000	13400
341	10000	14000	273	----	----
4884	----	----	341	10000	14800
సూపర్ 10	---	----	4884	10000	12500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14000	తేజ	10000	13800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	12200
బ్యాడిగి	10000	12600	దేవనూరు డీలక్స్	10200	12400
దేవనూరు డీలక్స్	10000	12500	తాలుకాయలు	5000	7000

నేటి నుంచి ప్యాసింజర్ రైలు వేళల్లో మార్పులు

మాచర్లటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మాచర్ల - విజయవాడ ప్యాసింజర్ రైలు ప్రయాణ వేళల్లో మార్పులు చేసినట్లు డీఆర్ఎం సుదేష్ణ తెలిపారు. బుధవారం నుంచి ఉదయం 6 గంటలకు రైలు మాచర్ల నుంచి ప్రారంభమవుతుందన్నారు. 6.20 గంటలకు రెంటచింతల, 6:32కు గురజాల, 6:48కు నడికుడి, 7:02కు తుమ్మలచెరువు, 7:13కు పిడుగురాళ్ల, 7:20కు బెల్లంకొండ, 7:27కు రెడ్డిగూడెం, 7:39కు సత్తెనపల్లి, 7:52కు పెదకూరపాడు, 8గంటలకు సిరిపురం, 8:08కు బండారుపల్లి, 8:18కు నల్లపాడు, 8:30కు గుంటూరు, 8:39కు పెదకాకాని, 8:52కు నంబూరు, 9:34కు మంగళగిరి, 9:54కు కృష్ణాకెనాల్, 10:55కు విజయవాడ చేరుకుంటుందన్నారు. ఈ మార్పును ప్రయాణికులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. మాచర్ల - గుంటూరు మధ్యన ఈ రైలు వేగాన్ని పెంచినట్లు తెలిపారు.

ప్రజలకు చేరువగా వాట్సాప్ గవర్నెన్స్

గురజాలటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మరింత చేరవ చేసే లక్ష్యంతో ప్రవేశపెట్టిన వినూత్న కార్యక్రమం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలు తమ సమస్యలను వినతులను సులభంగా అధికారులకు చేరవేయవచ్చని సచివాలయ సిబ్బంది అన్నారు. మంగళవారం మండలంలోని అన్ని గ్రామాల్లో వాట్సాప్ గవర్నెన్స్‌పై సచివాలయ సిబ్బంది ర్యాలీ జరిపారు. ప్రభుత్వం పాలనను ప్రజల వద్దకే తీసుకొచ్చేందుకు కృషి చేస్తోందన్నారు.

అమరావతిలో అవగాహన ర్యాలీ

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): భారతదేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్‌పై మండల పరిధిలోని లేమల్లె గ్రామంలో అవగాహన ర్యాలీ జరిగింది. ర్యాలీలో సర్పంచ్ పున్నమ్మ, పంచాయతీ కార్యదర్శి బి.రమేష్‌తో టీడీపీ నాయకులు దేవమణి, అనిల్, మొగులయ్య, గోవర్ధన్, నబీ, ఏసుపాదం, నరేంద్ర, సీనమ్మ, పాటు పలువురు పాల్గొన్నారు.

గుండె పోటుతో వీఆర్ఏ మృతి



షేక్ మౌలాలి సాహెబ్ (ఫైల్‌ఫొటో)

సత్తెనపల్లిరూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నాదేవి గ్రామానికి చెందిన వీఆర్ఏ షేక్ మౌలాలి సాహెబ్ మంగళవారం గుండె పోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని తహసీల్దార్ కే చక్రవర్తి, ఆర్ఐ బోసుబాబు, వీఆర్వోలు, వీఆర్ఏలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. శాఖాపరంగా మృతుడి కుటుంబసభ్యులకు అందాల్సిన ప్రయోజనాలను చూస్తామని తహసీల్దార్ తెలిపారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి



హనుమంతచారి (ఫైల్‌ఫొటో)

రాజుపాలెం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన రాజుపాలెంలో మంగళవారం ఉదయం జరిగింది. సేకరించిన వివరాలిలా ఉన్నాయి. రాజుపాలెం గ్రామానికి చెందిన నారాయణపురం హనుమంతచారి(41) క్రోసూరు పోలీస్‌స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజులాగానే మంగళవారం కూడా డ్యూటీకి బయల్దేరిన హనుమంతచారి ఇంట్లో నుంచి బయటకు వచ్చి మెట్లు దిగే క్రమంలో కాలు జారి కిందపడి పోయి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న రాజుపాలెం ఎస్ఐ వేణుగోపాల్ హనుమంతచారి సంతాపం తెలిపి కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

సత్తెనపల్లి ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని దోబీ ఘాట్‌లో సోమవారం రాత్రి జరిగింది. భీమవరానికి చెందిన పాలేటి మహేష్(35) కొన్ని సంవత్సరాలుగా భార్యకు దూరంగా అడుసుమల్లి ప్రశాంతి అనే మహిళతో సహజీవనం చేస్తున్నాడు. మంగళవారం ఉదయం మహేష్ ఇంట్లో ఉరివేసుకుని ఉండటాన్ని గుర్తించి భీమవరంలోని కుటుంబసభ్యులకు సమాచారం అందించింది. మహేష్ భార్య దయామణి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. దయామణి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జంగమహేశ్వరపురంలో పొలం పిలుస్తోంది



రైతులకు సూచనలు చేస్తున్న డీడీఏ శివకుమారి

గురజాలటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగమహేశ్వరపురం గ్రామ సచివాలయంలో మంగళవార డీడీఏ శివకుమారి, ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీ శాస్త్రవేత్త సైదానాయక్‌ల ఆధ్వర్యాన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి సాగులో యాజమాన్య పద్ధతులను వివరించారు. తెగుళ్ల, చీడపీడల గురించి వివరించి నివారణ సూచనలు చేశారు. వరి, మినుము సాగు చేసిన పొలాలను సందర్శించారు.

పార్టీలకతీతంగా రైతులకు సేవలు అందించాలి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్
● త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం



త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రవీణ్

అమరావతి, ఆగస్టు 5 (ఆంధ్ర జ్యోతి): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు పార్టీలకు అతీతంగా రైతులకు సేవలు అందించి సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం పెదమద్దూరు ప్రాథమిక వ్యవ సాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంఘ కార్యాలయంలో త్రిసభ్య కమిటీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రమాణ స్వీకారం జరిగింది. చైర్‌పర్సన్‌గా భావన సూర్యనారాయణ, పర్సన్స్‌గా పొదిలె సాంబశివరావు, సిద్దె శ్రీనివాసరావులు ఎమ్మెల్యే సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం చేసిన ముగ్గురిని భాష్యం ప్రవీణ్ సన్మానించారు. టీడీపీ శ్రేణులు ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. అనంతరం ప్రవీణ్ మాట్లాడుతూ సంఘ పరిధిలో గ్రూప్ తగాదాలకు తావులేకుండా అర్హత కలిగిన రైతులకు రుణసదుపాయం కల్పించాలన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. స్థానికులు పెదమద్దూరు వాగుపై వంతెన నిర్మాణం, వాటర్ ట్యాంక్ మరమ్మతులు చేయించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో సంఘ సీఈవో వెంకటేశ్వరరావు, మునగోడు, నరుకుళ్లపాడు, 75 త్యాళ్లూరు పీఏసీఎస్‌ల అధ్యక్షులు నాగోతు నాగార్జున, భాష్యం జగదీష్, ఏటుకూరి రత్నబాబు, సంగం డైయిరీ డైరెక్టర్ వి.ధర్మారావు, జాస్తి వీరాంజనేయులు, గుంటూరు మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, నూర్జహాన్, డీసీసీబీ మేనేజర్లు సుధీర్, గోపీ, పలువురు ప్రజాప్రతి నిధులు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

● ఓ ఫామ్ లేక పోవటంతో 11 మెట్రిక్ టన్నుల ఎరువుల నిలిపివేత



దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ మస్తానమ్మ

బెల్లంకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని క్రోసూరు ఏడీఏ మస్తానమ్మ తెలిపారు. మంగళవారం బెల్లంకొండలో ఎరువుల దుకాణాల్లో, గిడ్డంగుల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులకు ఎరువులను ప్రభుత్వ ధరకే అందించాలని, అలా కాకుండా అధిక ధరలకు విక్రయిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం వివిధ దుకాణాల్లో ఓ ఫామ్ లేక పోవటంతో 11 మెట్రిక్ టన్నుల ఎరువులను నిలుపుదల చేశామని, ఓ ఫాం వచ్చిన తరువాత షాపు యజమానులు ఎరువులను విక్రయించాలని సూచించారు. ఎరువులు విక్రయించిన తరువాత ప్రతి ఒక్క రైతుకు రసీదు తప్పకుండా ఇవ్వాలన్నారు. ఈ తనిఖీల్లో ఏడీఏతో పాటు ఏవో అరుణ కుమారి, షాపు యజమాని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల పట్టణంలో..

మాచర్లటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మార్క్‌ఫెడ్ ఆగ్రో సర్వీస్ సెంటర్ ఎరువుల దుకాణంలో మంగళవారం తహసీల్దార్ కిరణ్‌కుమార్, మాచర్ల వ్యవసాయ విస్తరణాధికారి మార్కొండేయులు తనిఖీలు జరిపారు. ఎరువుల స్టాక్, స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించారు. డీలర్ బిల్ పుస్తకాలు, ఇన్వాయిస్ కాపీలను తనిఖ చేశారు. రైతులకు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉంచాలని, రైతులకు కొనుగోలు బిల్లులను తప్పనిసరిగా ఇవ్వాలని, ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మాచర్ల పట్టణంలోని ఎరువుల దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

నిల్వల్లో తేడా ఉంటే చర్యలు

నకరికల్లు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నిషేధించిన ఎరువులను అమ్మినా, అనుమతులు లేకుండా ఉన్న కంపెనీల ఎరువులను అమ్మినా, స్టాక్‌లో వ్యత్యాలు ఉన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కే పుల్లారావు అన్నారు. మంగళవారం నకరికల్లులోని ఎరువుల దుకాణాలను ఏవో కే దేవదాసుతో కలసి తనిఖీ చేశారు.



నకరికల్లు ఎరువుల దుకాణంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఏవో

మార్కెట్‌యార్డుకు ఎన్టీఆర్ పేరు పెట్టాలి

● ముఖ్యమంత్రిని కలిసిన యార్డు చైర్మన్ దంపతులు



సీఎం చంద్రబాబునాయుడుకు బుద్ధుడి బొమ్మను అందజేస్తున్న మార్కెట్‌యార్డు చైర్మన్ శోభారాణి, శ్రీనివాసరావు దంపతులు

సత్తెనపల్లి ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మంగళవారం వెలగపూడిలోని సచివాలయంలో సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ కొమటినేని శోభారాణి, శ్రీనివాసరావులు కలిశారు. సత్తెనపల్లి మార్కెట్ యార్డుకు ఇంతవరకు ఎటువంటి పేరు లేదని దానికి ఎన్టీఆర్ వ్యవసాయ మార్కెట్ యార్డుగా నామకరణం చేయాలని కోరుతూ యార్డు పాలకవర్గం చేసిన తీర్మాన కాపీని వారు చంద్రబాబునాయుడుకు అందజేశారు. వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని రెండు మండలాల్లో 40గ్రామాల వరకూ ఉన్నాయని ఆయా గ్రామాల్లో లింకురోడ్లు లేక రైతులు పడుతున్న ఇబ్బందులను వారు సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం చంద్రబాబునాయుడుకు బుద్ధుడి బొమ్మను బహూకరించి శాలువాతో సత్కరించారు.

ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలి

● ఎస్టీయూ ఉపాధ్యక్షుడు గంగాధరబాబు

విజయపురిసౌత్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల ఖాళీలను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని ఎస్టీయూ ఉపాధ్యక్షుడు గంగాధరబాబు అన్నారు. మండలంలోని కొప్పునూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో మంగళవారం నిర్వహించిన ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డీఎస్సీ ఫలితాలను ప్రకటించి రెంటచింతల, వెల్దుర్తి, దుర్గి మండలాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల ఏరియా కార్యదర్శి టి.రాజశేఖర్, అబ్దుల్ జబ్బార్, బొమ్ము నాగరాజు, అబ్దుల్ రహిమాన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల విశిష్టతపై అవగాహన



కంభంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో కృష్ణవేణి, సూపర్‌వైజర్ అన్నపూర్ణ

మాచర్లరూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడు అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో కృష్ణవేణి, సూపర్‌వైజర్ అన్నపూర్ణ ఆధ్వర్యాన తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతను వివరించారు. తల్లిపాలతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

● గురజాలటౌన్ (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం 9లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి తల్లిపాల విశిష్టతను గర్భిణులు, బాలింతలకు వివరించారు.

కొప్పునూరులో..

విజయపురిసౌత్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పునూరులో గల అంగన్‌వాడీ కేంద్రం-3లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కొప్పునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ సూపర్‌వైజర్ వెంకట సుబ్బాచారి మాట్లాడుతూ బిడ్డ పుట్టగానే ముర్రుపాలు ఇవ్వాలని, అవి బిడ్డకు టీకా వంటివని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తాడువాయిలో..

అచ్చంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడువాయిలో మంగళవారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామసర్పంచ్ భూక్యా సీతాబాయి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యం మాట్లాడుతూ బిడ్డలకు ఆరునెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటమునిగిన పండ్ల తోటలు



నీట మునిగిన బెండ తోటను పరిశీలిస్తున్న సాగునీటి శాఖ అధికారి

పిడుగురాళ్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): వీరాపురం సమీపంలో రాష్ట్ర రహదారికి సమీపంలో ఉన్న 12ఆర్ కాలువపై హైవే అధికారులు కల్వర్టు నిర్మించకపోవడం వల్ల అధిక నీరు వస్తున్న సమయంలో సమీప పొలాల్లోని పంటలు మునకేస్తున్నాయని వీరాపురం గ్రామానికి చెందిన రావి రమణ, అద్దంకి ఏసురత్నంలు వాపోతున్నారు. నేషనల్ హైవే అధికారులు కల్వర్టు నిర్మించకుండా చిన్నపాటి పైపులు వేయడంతో వర్షపు నీరు, నాగార్జునసాగర్ కాలువ నీరు అధికంగా విడుదల చేసిన సమయంలో పంట పొలాలన్నీ మునకేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం కూడా రావి రమణకు చెందిన 13 ఎకరాలు కూరగాయల పంటలు, అద్దంకి ఏసురత్నంకు చెందిన ఒక ఎకరం నారుమడి, టమాట నారు పూర్తిగా నీట మునగడంతో సాగునీటి శాఖ అధికారులు డీఈ ఆదినారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు.

స్మార్ట్ మీటర్లు మాకొద్దు

● విద్యుత్ ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలి
● సబ్ స్టేషన్ల వద్ద ప్రజా సంఘాల నేతలు ధర్నా



నకరికల్లు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద లైన్‌మెన్ జయబాబుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు

నకరికల్లు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అదాని స్మార్ట్ మీటర్లు మాకొద్దు.. విద్యుత్ ట్రూ అప్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని కోరుతూ పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి అన్నారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు చేజర్ల విద్యుత్ సబ్ స్టేషన్, నకరికల్లు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం, ప్రజా సంఘాల నేతలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంసీపీఐ నేత మరికంటేశ్వరరావు, మునీర్, గోదా బాల, గాడిదమళ్ళ పిచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

● ముప్పాళ్ళ ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాగంటివారిపాలెంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతుసంఘం ఆధ్వర్యంలో నిర సన కార్యక్రమం నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్‌శాఖ ఏఈ సుచరితకు అందజేశారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ, జాలయ్య, పజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మంగళవారం సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ జరిగింది. అనంతరం స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు సచివాలయాల్లో వినతిపత్రాలను అందించారు.

● క్రోసూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో వేదిక సభ్యులు సంతకాల సేకరణ చేశారు. క్రోసూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ప్రజావేదిక సభ్యులు పాల్గొన్నారు.

● అచ్చంపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను తక్షణమే రద్దు చేయాలని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి షేక్ మస్తాన్ బుజ్జి, సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ విద్యుత్ మీటర్లు మా ఇళ్లకు బిగించవద్దు అంటూ వామపక్ష ప్రజాసంఘాల నాయకులు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి ట్రాన్స్‌కో ఏఈ రవి కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు సూరిబాబు, మొహిద్దీన్‌వలి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

● రెంటచింతల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్కరణల పేరుతో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ వామపక్ష నేతలు మంగళవారం రెంటచింతల విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఐ(ఎం) మండల కార్యదర్శులు, కార్మిక సంఘ నేతలు, రైతు కూలీ సంఘ నేతలు తదితరులు పాల్గొన్నారు.

● కారంపూడి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వామపక్షాల ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి షేక్ సైదా మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులపై అధిక భారంగా మారుతున్న స్మార్ట్ మీటర్ల అమలు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనకు దారితీస్తోందన్నారు.

● దాచేపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగార్లపాడు గ్రామంలో ప్రజల నుంచి నాలుగు వందల సంతకాలను సేకరించారు. ప్రజావేదిక ఆధ్వర్యంలో సచివాలయంలోని పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. నారాయణపురంలో సీపీఐ నాయకులు దాచేపల్లి ఎలక్ట్రికల్ ఏడీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వ హించారు.

ఏరియా వైద్యశాలలో రొట్టెలు, పండ్లు పంపిణీ

సత్తెనపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ పట్టణశాఖ అధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. వైద్యశాల గైనకాలజిస్టు డాక్టర్ సుజాత తల్లిపాల ప్రాధాన్యం గురించి గర్భిణులకు, బాలింతలకు వివరించారు. అనంతరం రోగులకు లయన్స్ క్లబ్ సభ్యులు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బండ్లమూడి వీరాంజనేయులు, మాజీ అధ్యక్షుడు పొన్నెకంటి కిషోర్‌బాబు, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మాలమహాసభ జిల్లా కన్వీనర్‌గా రాజు



గొట్టి ముక్కల రాజు

పిడుగురాళ్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీ నగర్‌కు చెందిన గొట్టి ముక్కల రాజును పల్నాడు జిల్లా మాల మహాసభ కన్వీనర్‌గా నియమిస్తూ మాల మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు నియామక పత్రం అందజేశారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా మాలమహాసభను అభివృద్ధి చేయడంతో పాటు మాల ఉద్యోగులు, విద్యార్థులలో చైతన్యం నింపేందుకు తనవంతు కృషి చేస్తానని రాజు తెలిపారు.

మంత్రి పయ్యావులను కలిసిన ఎమ్మెల్యే యరపతినేని



ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును సత్కరించిన పిడుగురాళ్ల సున్నం వ్యాపారులు

పిడుగురాళ్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుతో కలసి మంగళవారం పిడుగురాళ్లకి చెందిన పలువురు సున్నం వ్యాపారులు ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను వెలగపూడి సచివాలయం దగ్గర కలిశారు. సున్నపు పరిశ్రమ మిల్లులపై ఉన్న సేల్స్‌టాక్స్ డిమాండ్స్‌ను రద్దు చేయాలని.. సున్నం వ్యాపారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి ఎమ్మెల్యే యరపతినేని తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన మంత్రి త్వరలో సమస్యను పరిష్కరిస్తామని సున్నం వ్యాపారులకు హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి కేశవ్, యరపతినేని శ్రీనివాసరావులను సున్నం వ్యాపారులు సత్కరించారు. కార్యక్రమంలో యరపతినేని నిఖిల్ పలువురు సున్నం వ్యాపారులు ఉన్నారు.

పంచాయతీరాజ్ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే కన్నా



పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజను కలిసిన ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఎంవీఆర్ కృష్ణతేజను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం తాడేపల్లి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కోర్టు భవన నిర్మాణానికి జడ్పీ భూమిని కేటాయించాలని జడ్పీలో ఆమోదం పొందిన భూమిని పరిశీలించి త్వరగా పూర్తయ్యేలా చూడాలని కన్నా లక్ష్మీనారాయణ కోరారు.

13 నుంచి అమరేశ్వరాలయ వార్షికోత్సవాలు



పవిత్రోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్ దంపతులు

అమరావతి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అమరేశ్వరస్వామి దేవస్థాన వార్షిక పవిత్రోత్సవాలు ఈనెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయని దేవస్థాన సహాయ కమిషనర్ రేఖ తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, లావణ్య దంపతుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రేఖతో పాటు ఆలయ అర్చకులు, వీసపాటి నాగేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

● నియోజకవర్గ రైతు సంఘం ఉపాధ్యక్షుడు దున్నా చెన్నయ్య చౌదరి

మాచవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి పాటు పడింది కూటమి ప్రభుత్వమేనని, ఈ విషయంపై వైసీపీ నాయకులకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే అర్హత లేదని నరసరావుపేట పార్లమెంటరీ నియోజకవర్గ రైతుసంఘం ఉపాధ్యక్షుడు దున్నా చెన్నయ్య చౌదరి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మోర్జంపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సోమవారం మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు పల్నాడు జిల్లా కలెక్టర్‌ను కలసి రైతులకు ఎరువులు సకాలంలో అందించటం లేదంటూ ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన చెన్నయ్య చౌదరి వైసీపీ నాయకులు గత ఐదు సంవత్సరాల పరిపాలనా కాలంలో రైతులకు ఏమి ఒరగ బెట్టారని అధికారులను కలుస్తున్నారని ప్రశ్నించారు. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో రైతులకు ఒక్క వ్యవసాయ పరికరమైనా అందించారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించే అర్హత వైసీపీ నాయకులు ఎప్పుడో కోల్పోయారని తెలియజేశారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు ప్రభుత్వం చేస్తున్న మంచి పనులకు సూచనలు, సలహాలు ఇవ్వాలని హితవు పలికారు. విలేకరుల సమావేశంలో యామని రాంబాబు, పోలిశెట్టి బాపయ్య, వెలగాల నరసింహారావు, నీలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మార్కెట్ యార్డు డైరెక్టర్ పల్చూరి మృతి



ధనుంజయరావు (ఫైల్‌ఫొటో)

పిడుగురాళ్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల మార్కెట్ యార్డు డైరెక్టర్ పల్చూరి ధనుంజయరావు (55) మంగళవారం గుండెపోటుతో పిడుగురాళ్లలోని తన నివాసంలో మృతి చెందారు. పట్టణ ఆర్యవైశ్య సామాజికవర్గంలోనూ, టీడీపీలోనూ చురుకుగా పనిచేస్తున్న ధనుంజయరావును ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఇటీవల మార్కెట్ యార్డు నూతనకమిటీలో డైరెక్టర్‌గా నియమించారు. ధనుంజయరావు మృతి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, నిఖిల్ ఫోన్‌లో ధనుంజయరావు కుటుంబసభ్యులను మాట్లాడి సంతాపం తెలియజేశారు. అనంతరం మార్కెట్ యార్డు చైర్మన్ తురకా వీరస్వామి, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కనిగిరి శ్రీను, పిల్లి చెన్నారావు, పణితి రవి, వీవీ నాగేశ్వరరావు, ఎస్ఆర్ఎంటీ సుబ్బారావు, కార్ సైదా, కోట హరి, సుతారు నాగమల్లేశ్వరరావు, వడ్డవల్లి సాంబశివరావు, సయ్యద్ అమీర్‌అలి, వల్లెపు రామకృష్ణ, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

15వ తేదీ లోగా పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

క్రోసూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : పత్తి, కంది, మిర్చి, వరి పంటలు వేసిన రైతులు ఈ నెల 15వ తేదీ లోగా పంటల బీమా ప్రీమియం చెల్లించాలని మండల వ్యవసాయ అధికారి వీ వేణుగోపాల్ అన్నారు. మంగళవారం అందుకూరు, బాలెమర్రు గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం రైతుసేవాకేంద్రంలో రైతులతో మాట్లాడారు. కౌలు రైతులు తప్పనిసరిగా రైతుసేవాకేంద్రాల సిబ్బందిని, వీఆర్‌వోలను కలసి గుర్తింపు కార్డులు పొందాలన్నారు. అన్నదాత సుఖీభవ నగదు జమకాని వారు రైతు సేవాకేంద్రాల సిబ్బందిని సంప్రదించాల్సి ఉందన్నారు. రైతులు తాము వేసిన పంటను తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని కోరారు.

అర్హులైన రైతులు వివరాలు నమోదు చేయించుకోవాలి

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం ద్వారా అర్హులై ఉండి నగదు జమ కాని రైతులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రానికి వెళ్ళి కేంద్రం సిబ్బంది ద్వారా తమ వివరాలను అన్నదాత సుఖీభవ పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలని ఏవో బీ సుబ్బారెడ్డి అన్నారు. మండలంలోని పెద మక్కెన, గర్నెపూడి గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అర్హులైన రైతులు ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలి

మాచవరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ నగదు కాని జమ కాని వారు ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని ఏవో రామమ్మ రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని మోర్జంపాడు గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని, క్రాపు ఇన్సూరెన్స్ కూడా చేయించు కోవాలని తెలియజేశారు.



ఓ ఉపాధ్యాయుడి.. ఏఐ ఊహ

ఒకవైపు ఎత్తైన గేట్లు.. వాటి నుంచి జాలు వారుతూ కృష్ణమ్మ శోయగాలు.. నదిలో నీటి పరవళ్లు.. ఆ పక్కనే పచ్చని చెట్లు.. ఎమ్యూజిమెంట్ పార్కు.. చిన్నా పెద్ద మైమరిచేలా ఉన్న ఈ అందాల ఊహ మాచర్లకు చెందిన జకీర్ హుస్సేన్ అనే ఉపాధ్యాయుడి ఆలోచన. ఏఐ సహకారంతో రూపొందించిన ఈ అత్యద్భుత ఊహాచిత్రాలను సోషల్ మీడియాలో పోస్టు చేసి పర్యాటకుల అభిప్రాయాన్ని ఆ ఉపాధ్యాయుడు కోరారు. ఆ ఉపాధ్యాయుడి ఆలోచన కార్యరూపం దాల్చాలని పలువురు కోరుతున్నారు. సాగర్ వద్ద విమానాశ్రయం మంజూరు కాగా.. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వానికి పెద్దఎత్తున ఆదాయం లభిస్తుంది. పర్యాటక కేంద్రంగా సాగర్ అభివృద్ధిపై మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

-(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

అమృత్ స్టేషన్లలో పనులు

వేగవంతంగా పూర్తి చేయాలి

- నాణ్యత, భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలి
- దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అమృత్ స్టేషన్ స్కీమ్ కింద గుంటూరు రైల్వే డివిజన్‌లో ఎంపిక చేసిన రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ ఆదేశించారు. పనులు నాణ్యతగా జరిగేలా నిరంతరం ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. భద్రతా ప్రమాణాలు కూడా పాటించేలా చూడాలన్నారు. మంగళవారం రియర్ గ్లాస్ విండో వాహనం(రైలు) ద్వారా పగిడిపల్లి నుంచి గుంటూరు రైల్వే డివిజన్ అధికారులతో కలిసి ఇన్‌స్పెక్షన్ ప్రారంభించారు. ఆయనతో పాటు గుంటూరు, విజయవాడ డివిజన్ల రైల్వే మేనేజర్లు సుదేష్ణ సేన్, మోహిత్ సోనాకియా ఆయన వెంట ఉన్నారు. పగిడిపల్లి - గుంటూరు సెక్షన్‌లో అనుమతించిన వేగంతో రైలు ప్రయాణించినప్పుడు కుదుపులు వస్తున్నాయా, లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం సిగ్నలింగ్ వ్యవస్థ, భద్రతా అంశాలను, రైల్వే ట్రాక్‌ల నిర్వహణను తనిఖీ చేశారు. నల్గొండ రైల్వే స్టేషన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి వెయిటింగ్ హాల్, దివ్యాంగుల టాయిలెట్లు, లిఫ్ట్, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. ప్లాట్ ఫాం, సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని కూడా సందర్శించారు. తర్వాత గుంటూరు డివిజన్ ప్రధాన కార్యాలయంలో డివిజనల్ రైల్వే మేనేజర్, ఇతర డివిజనల్ అధికారులతో డివిజన్ పనితీరుపై వివరణాత్మక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. డివిజన్‌లో చేపట్టిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల స్థితి, పురోగతిపై అధికారులు క్లుప్తంగా ఆయనకు వివరించారు. అమరావతి రాజధానికి నూతన రైలు మార్గం, నడికుడి - శ్రీకాళహస్తి రైలు మార్గాల ప్రస్తుత స్థితి గురించి తెలుసుకొన్నారు. గుంటూరులో మొక్కలు నాటే కార్యక్రమంలో జీఎం పాల్గొన్నారు. అనంతరం జనరల్ మేనేజర్ మంగళగిరి రైల్వే స్టేషన్‌ను పరిశీలించి ప్రయాణికుల సౌకర్యా లు, స్టేషన్‌లోని ఇతర వసతులను తనిఖీ చేశా రు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా జరుగుతున్న పునరాభివృద్ధి పనులను కూడా ఆయన పరిశీలించారు. పని ప్రదేశంలో అన్ని భద్రతా మార్గదర్శకాలను పాటించాలని, నిర్మాణ పనులను నిర్ధారించిన గడువు నాటికి పూర్తి చేయడానికి పనుల వేగాన్ని పెంచాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం విజయవాడ డివిజన్ పర్యటనకు జీఎం వెళ్లారు. జనరల్ మేనేజర్ గుంటూరు డివిజన్ తనిఖీ సందర్భంగా వివిధ కార్మిక సంఘాల సభ్యుల నుంచి విజ్ఞాపనలను స్వీకరించారు.



రైల్వే ట్రాక్ తనిఖీ చేస్తున్న రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ



గుంటూరు రైల్వే డివిజన్ ఇన్‌స్పెక్షన్‌లో పాల్గొన్న రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

పెరోటిడ్ కార్సినోమా రోగికి

అరుదైన శస్త్రచికిత్స



మాట్లాడుతున్న రమణ యశస్వి, పక్కన కోలుకున్న అశోక్

గుంటూరు మెడికల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): లాలాజల గ్రంధికి సోకిన కేన్సర్ ట్యూమర్‌తో రెండేళ్లుగా బాధపడుతున్న యువకుడికి గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి, ప్రాణాలు సంరక్షించారు. మంగళవారం ఆసుపత్రి సర్జరీ విభాగంలోని జెయిలీ హాల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. ప్రత్తిపాడు మండలం గొట్టిపాడుకు చెందిన అశోక్‌కు (32) రెండేళ్లుగా ముఖంపై గడ్డ ఏర్పడింది. చికిత్స కోసం పలు ఆసుపత్రులను ఆశ్రయించినా ఆపరేషన్ చేసేందుకు ప్రైవేటు వైద్యులు ముందుకు రాలేదు. చివరి ప్రయత్నంగా అశోక్ ఇటీవల గుంటూరు జీజీహెచ్‌కు వచ్చారు. జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ యేకుల కిరణ్‌కుమార్, బాధితుడికి సీటీ స్కాన్, బయాప్సీ తదితర పరీక్షలు చేయించారు. ఇది లాలాజల గ్రంధి కణితిగా (మిక్స్‌డ్ పెరోటిడ్ ట్యూమర్) తేలింది. గడ్డను తొలగించడం ఆలస్యమైతే కేన్సర్ కణితిగా మారే ప్రమాదం ఉంటుంది.

వైద్యులకు సవాల్‌గా మారిన వైనం...

ముఖంలో 24 కండరాలతో పాటు ఐదు కపాల నరాలు ఉంటాయి. ముఖంపై కణితిని తొలగించే క్రమంలో ముఖ కండరాలు, నరాలు దెబ్బతింటే ఆహారం తీసుకోవడంలో ఇబ్బందితో పాటు ముఖ కవళికల్లో మార్పులు వస్తాయి. దీంతో వైద్య నిపుణులు సవాల్‌గా ఈ కేసును స్వీకరించారు. డాక్టర్ కిరణ్ కుమార్ నేతృత్వంలో జనరల్ సర్జరీ వైద్య బృందం నాలుగు గంటల పాటు శ్రమించి అశోక్‌కు క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించారు. ముఖంలో కండరాలు, నరాలు ఏమాత్రం దెబ్బతినకుండా పెరోటిడ్ ట్యూమర్‌ను విజయవంతంగా తొలగించారు. ఆపరేషన్ అనంతరం కణితిని పెథాలజీ పరీక్షలకు పంపగా, పెరోటిడ్ కార్సినోమా (లాలాజల గ్రంధి కేన్సర్‌గా) నిర్ధారణ అయ్యింది. సకాలంలో కేన్సర్ గడ్డను తొలగించడంతో అశోక్‌కు ప్రాణగండం తప్పింది. అరుదైన ఆపరేషన్‌ను నిర్వహించిన డాక్టర్ కిరణ్‌కుమార్ వైద్య బృందాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి అభినందించారు. ఆరోగ్యపరంగా కోలుకోవడంతో మంగళవారం అశోక్‌ను ఆసుపత్రి నుంచి డిశ్చార్జీ చేశారు.

గంటలోనే రిజిస్ట్రేషన్

◆ మంత్రి అనగాని సత్యప్రసాద్ ◆ కొరిటెపాడులో ఆటోమ్యుటేషన్ పరిశీలన

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గతంలో మాదిరిగా గంటల తరబడి వేచి చూడకుండా.. కార్యాలయానికి వచ్చిన గంటలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. స్థానిక కొరిటెపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించిన మంత్రి అర్బన్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ విధానాన్ని పరిశీలించారు. గుంటూరుకు చెందిన అలపాటి సుధాకర్ సతీమణి నాగ లీలావతికి దఖలు దస్తావేజు ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన విధానాన్ని పరిశీలించి, నగరపాలక సంస్థలో పేరు మార్చిన సర్టిఫికెట్‌ను అందజేశారు. కేవలం 15 నిమిషాల 30 సెకండ్లలో స్కాన్, ఈకేవైసీ పూర్తి చేసి ట్రాన్స్‌ఫర్ దస్తావేజులు అందించినట్లు మంత్రి చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 13 నెలల్లో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టిందన్నారు. ఆటో మ్యుటేషన్ అద్భుతమైన ప్రక్రియ అన్నారు. ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని సులభతరమైన విధానాలను అవలంబించి తక్కువ సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు లక్షా 14 వేల డాక్యుమెంట్లను వినియోగదారులకు పంపిణీ చేసామని, సుమారు ఎనిమిది వేల మ్యారేజ్ సర్టిఫికెట్లను వాట్సప్ ద్వారా పంపినట్లు చెప్పారు. వాట్సప్ ద్వారా ఇంటి వద్దకే డాక్యుమెంట్స్ పంపిస్తున్నామన్నారు. ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌లోని లోపాలను సరిదిద్దుతున్నామన్నారు. గత పాలకులు ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌పై తీసుకున్న విధానంపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి విచారణ జరిపిస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ డీఐజీ శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్ శైలజ, సబ్ రిజిస్ట్రార్ వేంకటేశ్వరరావు, కార్యాలయ సీనియర్ సహాయకులు ధరమ్ తేజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కొరిటెపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆటోమ్యుటేషన్‌ను పరిశీలిస్తున్న మంత్రి అనగాని



కొత్త రూపు దాల్చిన అంబులెన్స్

సంజీవనిగా.. కుయ్..కుయ్..!

● తెలుగు లోగిళ్లను తలపించేలా.. ● అంబులెన్స్‌లకు కొత్త రూపు

గుంటూరు మెడికల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అంబులెన్స్‌లు కొత్త రూపు దాల్చాయి. సంజీవని పేరిట కొత్తగా రోడ్లపై పరుగులు పెట్టనున్నాయి. తెలుపు, పసుపు రంగులు మేళవించి.. ఎర్రటి బోర్డర్‌తో తెలుగు లోగిళ్లను తలపించేలా.. సిద్ధం చేశారు. వీటికి రిఫ్లెక్టివ్ టేపులను కూడా అతికించారు. ఈ వాహనాలపై ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఫొటోలను ముద్రిస్తున్నారు. గత వైసీసీ ప్రభుత్వ హయాంలో ఈ వాహనాలకు నీలం రంగు వేశారు. ప్రస్తుతం కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవిల్లి పారిశ్రామికవాడలోని కుశలవ కోచ్‌లో అంబులెన్స్ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ వాహనాల్లో అత్యాధునిక వైద్య పరికరాలను కూడా ఏర్పాటు చేశారు. అతి త్వరలో రాష్ట్రంలోని రోడ్లపై కొత్త సంజీవని అంబులెన్స్‌లు కుయ్ కుయ్‌మని పరుగులు దీయనున్నాయి.

'పల్నాడు', 'సింహాద్రి' ప్రయాణికులు గమనించాలి

● ఈ తేదీల్లో సీసీ బదులు త్రీటైర్ ఏసీ కోచ్ ఏర్పాటు

గుంటూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాల రీత్యా ఈ నెల 7న 17247 గుంటూరు - వికారబాద్ పల్నాడు ఎక్స్‌ప్రెస్‌ని ఏసీ చైర్‌కార్‌కు బదులుగా త్రీ టైర్ ఏసీ బోగీతో నడపడం జరుగుతుందని డీఆర్ఎం సుదేష్ణ సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న గుంటూరు - విశాఖపట్టణం సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ని కూడా ఏసీ చైర్‌కార్ బదులుగా త్రీటైర్ ఏసీ కోచ్‌తో నడుపుతామమని తెలిపారు. ఈ మార్పు దృష్ట్యా ప్రయాణికులు తమ సీటు నంబర్లు ముందస్తుగా చెక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

26, 30 తేదీల్లో ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రద్దు

ఈ నెల 26, 30 తేదీల్లో 22876 గుంటూరు - విశాఖపట్నం ఉదయ్ డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేసినట్లు డీఆర్ఎం తెలిపారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలన్నారు.

ఉపాధి మేతకు..

కృత్రిమ మేధతో చెక్.!

దొంగ మస్టర్ల నివారణకు.. ముఖ ఆధారిత హాజరు

దొంగ పనుల నిరోధానికి సాంకేతిక పరిజ్ఞానం

కింది స్థాయి సిబ్బందికి డ్వామా అధికారుల శిక్షణ

గుంటూరు సిటీ,ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకానికి తలనొప్పిగా మారిన దొంగ మస్టర్లు, పనులకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. అందుకోసం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఉపాధి హామీ పథకానికి జోడించేందుకు సన్నాహాలు చేస్తోంది. అందులో భాగంగా కిందిస్థాయి సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయిలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంగళవారం నుంచి ప్రారంభమైన.. శిక్షణ తరగతుల్లో.. ఎన్ఆర్ఈజీఎస్‌లో పనిచేస్తున్న అన్ని స్థాయిల సిబ్బందిని భాగస్వామ్యం చేస్తున్నారు. డ్వామా పీడీ శంకర్ పాల్గొని, మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగం గురించి వివరించారు.

ముఖ ఆధారిత హాజరు మాత్రమే..

ఇక మీదట ఉపాధి హామీ పనులకు హాజరయ్యే ప్రతి కార్మికుని ముఖ ఆధారిత హాజరు తీసుకుంటారు. దాని వల్ల దొంగ మస్టర్లను అరికట్టే అవకాశం ఉంటుంది. ఈ హాజరు ప్రక్రియను ప్రారంభించాడానికి ఉపాధి హామీ కార్మికుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నారు. ఈ రికార్డ్ ఆధారంగా ఏఐ పనికిహాజరైన కార్మికుల వివరాలను సరిపోల్చడం జరుగుతుంది. ముఖ ఆధారిత హాజరు వేసే వారికి మాత్రమే ఆ రోజు మస్టర్ పడుతుంది. ఇప్పటి వరకు రాజకీయ నాయకులు, ఉపాధి సిబ్బంది వారికి అనుకూలమైన వారికి పనికి వెళ్లకుండానే మస్టర్లు వేయడం జరుగుతోంది. ముఖ ఆధారిత హాజరు ప్రక్రియ ఆరంభం అయితే దొంగ మస్టర్ల కు చెక్ పడుతుంది.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ శంకర్

దొంగ పనులకు..

దొంగ పనులకు చెక్ పెట్టేందుకు వీలుగా అత్యా ధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోనున్నారు. జియో ఫెన్సింగ్, ట్యాగింగ్ ప్రవేశ పెడుతున్నారు. ఈ విధానం వల్ల పూర్తి స్థాయిలో జరిగిన పనులకు మాత్రమే బిల్లు చేసే అవకాశం ఉంటుంది.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

విద్యుత్ అంతరాయానికి అధికారులే

బాధ్యత వహించాలి

● విద్యుత్ శాఖ సీఎండీ పుల్లారెడ్డి

విజయవాడ సిటీ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): లైన్ల మరమ్మతులు, పాడైన ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఏపీ సీపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి.పుల్లారెడ్డి హెచ్చరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేసి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని సూచించారు. సీపీడీసీఎల్ పరిధిలోని ఎన్టీఆర్, కృష్ణా, సీఆర్డీఏ, గుంటూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాల అధికారులతో విజయవాడలోని ఎన్టీఆర్ సర్కిల్ కార్యాలయంలో సీఎండీ సమావేశమై దిశానిర్దేశం చేశారు. 33/11 కేవీ సబ్ స్టేషన్స్, సరఫరా లైన్ల అంతరాయాలను తగ్గించాలన్నారు. సిబ్బందిని, సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను, మీటర్లను వెంటనే మార్చాలని ఆదేశించారు. సరఫరాకు అంతరాయం ఏర్పడే గణాంకాలు ఫీడర్ల వారీగా తన వద్ద ఉన్నాయని సీఎండీ తెలిపారు. రైతులకు నూతన విద్యుత్ కనెక్షన్‌లు తక్షణమే మంజూరు చేయాలని ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకం ప్రయోజనాలను ఎస్సీ, ఎస్టీ గృహ సబ్సిడీ వివరాలను వినియోగదారులకు వివరించి, సోలార్ ప్యానెల్‌లు ఏర్పాటుకు లబ్ధిదారుల సమ్మతి లేఖ తీసుకోవాలన్నారు. ఆర్‌డీఎస్ఎస్ పథకంలో మంజూరైన మండల ప్రాంతాల్లో 33 కేవీ, 11 కేవీ వ్యవసాయ ఫీడర్లను విభజించే పనులు త్వరగా పూర్తి చేసి ఆయా ప్రాంతాలకు 24 గంటల నిరంతర 3-ఫేస్ విద్యుత్ సరఫరా అందించాలని ఆదేశించారు. టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ యాదవ్, ప్రాజెక్ట్ డైరెక్టర్ కేవీఎస్ఎన్ మూర్తి, ఫైనాన్స్ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్ఈ తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

లక్షణంగా..నిర్వహణ సాగేలా!

- పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు నిధులు
- ఒక్కో కేంద్రానికి రూ.లక్ష విడుదల
- గతంలో నిధులు దారిమళ్లించిన వైసీపీ

సత్తెనపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ఈ నేపథ్యంలో వాటి సేవలను మరింత బాలోపేతం చేయాలని ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి. లక్ష్యం మేరకు.. వాటి సేవలు అందించడం లేదని గుర్తించి, వాటిని ప్రజలకు చేరువ చేయాలనే.. ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో చర్యలు చేపట్టాయి. ఒక్కో ప్టటణ ఆరోగ్య కేంద్రానికి.. నిర్వహణ నిమిత్తం ఏడాదికి లక్ష రూపాయలు చొప్పున జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. సత్తెనపల్లి పట్టణంలో మూడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఇక్కడ డాక్టర్లతో పాటు ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు, స్టాఫ్ నర్సులు, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆరోగ్య కార్యకర్తల సేవలు అందుబాటులో ఉన్నాయి.

దారి మళ్లించిన వైసీపీ ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించిన దాఖలాలు లేవు. జాతీయ ఆరోగ్య మిషన్ నుంచి మంజూరైన నిధులను ఇతర అవసరాలకు మళ్లించారు. గతంలో నిర్వహణకు రూ.33వేలు చొప్పున అందజేశారు. ఆ నిధులతో ప్రజలకు సేవలు అందించడం కష్టమే. పారిశుధ్యం, స్టేషనరి, విద్యుత్ బిల్లుల చెల్లింపు, ఆస్పత్రి నిర్వహణకు వినియోగించుకొనేలా.. లక్ష రూపాయల చొప్పున ప్రస్తుతం మంజూరు చేశారు. ప్రతి పైసా సక్రమంగా ఖర్చు అయ్యేలా కమిటీలు ఏర్పాటు చేసి, పర్యవేక్షించనున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉంచి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టనున్నారు. తద్వారా పట్టణ ప్రాంత వాసులకు మంచి వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.



పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

రూ.20లక్షలతో మురుగు కాలువల్లో పూడికతీత

చిలకలూరిపేట, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన మురుగు కాలువలలో పూడికతీత పనులను రూ.20లక్షలతో చేపట్టినట్టు మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు మంగళవారం తెలిపారు. నెల రోజులుగా జరుగుతున్న ఈ పనులు మరో 10 రోజులు పాటు కొనసాగుతాయని ఆయన తెలిపారు. చిన్నపాటి వర్షానికే జలమయమవుతున్న సంజీవనగర్ వాసులకు పూడికతీతతో ఊరట లభించింది. సంజీవనగర్‌కు జాతీయ రహదారికి మధ్యన ఉన్న ప్రధాన మురుగు కాల్వలో పేరుకుపోయిన పూడికను మంగళవారం ఎక్స్‌కవేటర్‌తో తొలగించడం ప్రారంభించారు. మరో రెండు రోజుల పాటు ఈ కాలువలోని వ్యర్థాలను తొలగించే పని కొనసాగుతోంది.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పీ4పై అధికారులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

వినుకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పీ-4 విధానంపై సీఎం చంద్రబాబునాయుడు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఆయన స్ఫూర్తితో నియోజకవర్గంలోని 100మంది పేద కుటుంబాలను తాను దత్తత తీసుకోవడం జరిగిందని తెలిపారు. పట్టణం, గ్రామల్లోని అధికారులు బంగారు కుటుంబాలను గుర్తించి దత్తత తీసుకొని వారి సమస్యలను పరిష్కరిస్తూ పేదరిక నిర్మూలనకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి శ్రీరాములు, జిల్లా డ్వామా పీడీ సిద్దలింగమూర్తి, మున్సిపల్ చైర్మన్ దస్తగిరి సతీమణి, కౌన్సిలర్ షకీలాబేగం, తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీ

రొంపిచర్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్లలో తూనికలు, కొలతల శాఖ అధికారులు మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు దుకాణాల్లో కాటాలను తనిఖీచేశారు. కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలి

నాదెండ్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తూబాడు - ఎండుగుంపాలెం గ్రామాల పరిధిలో ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ బాజీ ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందించారు. గతంలో చిలకలూరిపేట నుంచి తూబాడు, చందవరం గ్రామాల మీదుగా నరసరావుపేటకు బస్సులు నడిచేవన్నారు. ప్రస్తుతం అవి లేవని, ఎండుగుంపాలెంకు బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అమలు జరపనున్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని పొందేందుకు గ్రామీణలకు అవకాశం కల్పించాలని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

9న మెగా నేత్ర వైద్య శిబిరం

నరసరావుపేట టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ కోడెల శివప్రసాదరావు చారిటబుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో 9వ తేదీన ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం జరుగుతుందని మందాడి రవి మంగళవారం తెలిపారు. రాజాగారికోటలోని డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆసుపత్రిలో ఈ మెగా వైద్య శిబిరం ఉదయం 9గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్టుకు కృష్ణవేణి కళాశాల విద్యార్థిని ఎంపిక

నరసరావుపేట టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ బాలికల జట్టుకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థి కే కావ్య ఎంపికైందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. గుంటూరు నగరం ఎన్జీవో క్లబ్ ఆవరణలో ఈ నెల 3న జరిగిన బాల్‌బ్యాడ్మింటన్ పోటీలలో ఎంపికైందన్నారు. ఎంపికైన కే కావ్య ఈ నెల 29 నుంచి 31వరకు ప్రకాశం జిల్లా చేవూరులో నిర్వహించే అంతర జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. కే కావ్యను కళాశాల పీడీ ఈదర ఆదిబాబు, అధ్యాపకులు అభినందించారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

వినుకొండ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ పరిధిలో అక్రమంగా మద్యం అమ్ముతున్న అప్పిరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొని అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. అనంతరం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పొలం బాటలకు మహర్దశ

శావల్యాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోని పొలాలకు వెళ్ళే మట్టిరోడ్లకు మహర్దశ కలుగనుంది. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మట్టి రోడ్లకు మరమ్మతులు చేసేందుకు సొంత ఖర్చులతో ఎక్స్‌కవేటర్‌ను పంపడంతో రైతులు ఇందనపు ఖర్చులను భరించి రోడ్లను బాగుచేసుకునేందుకు శ్రీకారం చుట్టారు. శావల్యాపురంలోని పొలాలకు వెళ్ళే రోడ్లకు మరమ్మతులను ప్రజాప్రతినిధులు, రైతులు కలసి మంగళవారం ప్రారంభించారు. ప్రస్తుతం కొత్తలూరు గ్రామపంచాయతీ పరిధిలో మట్టిరోడ్ల మరమ్మతులు పూర్తయ్యాయి.

జర్నలిస్టుల అక్రిడేషన్ల కోసం తహసీల్దార్‌కు వినతి

వినుకొండ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలతో పాటు అక్రిడేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలంటూ వినుకొండ తహసీల్దార్ కార్యాలయంలో జర్నలిస్టులు తహసీల్దార్‌ను కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సురేష్‌నాయక్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ఇప్పటికే ల్యాండ్ కొనుగోలు పద్ధతి ద్వారా స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

పేద రోగులకు అండగా సీఎం సహాయనిధి

చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పేద రోగులకు సీఎం సహాయనిధి ఎంతో భరోసాను ఇస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. చీఫ్‌విప్ జీవీ కార్యాలయంలో 60మంది లబ్ధిదారులకు రూ.41.69లక్షల చెక్కులను బాధితులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి బాధితులకు వెంటనే మంజూరు చేసి ధైర్యం అందిస్తూ ఆర్థిక భరోసా ఇస్తున్న సీఎం చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అనారోగ్య సమస్యలతో అప్పుచేసి ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సపొందిన పేదలకు ప్రభుత్వం ఆ ఖర్చును సీఎం సహాయనిధి ద్వారా చెల్లించి ఆదుకోవడం జరుగుతుందన్నారు. పేద కుటుంబాలు వైద్యం కోసం అప్పుల పాలు కాకూడదనే ఉద్దేశంతోనే సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థికసాయం సీఎం చంద్రబాబునాయుడు అందజేసి కుటుంబాలను ఆదుకోవడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలో వినుకొండ నియోజకవర్గంలోని 647మందికి బాధిత కుటుంబాలకు రూ.4.55కోట్లు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థికసాయం చేసి ఆదుకోవడం జరిగిందన్నారు. సీఎం సహాయనిధి అందుకున్న బాధితులు ఆరోగ్యంగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

ఎమ్మెల్యే అరవిందబాబు



నూతన రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రహదారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట మండలంలోని రావిపాడు-సంతగుడిపాడు గ్రామాల మధ్య రూ.1.75కోట్ల వ్యయంతో రహదారి అభివృద్ధికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మంగళవారం శంకుస్థాపన చేశారు. నాబార్డు నిధులతో రూ.1.75 కోట్ల వ్యయంతో ఈ రహదారి నిర్మాణం జరగనుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణం, మరమ్మతుల కోసం గణనీయమైన నిధులు కేటాయించారన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 2,000 కి.మీ. కొత్త రహదారుల నిర్మాణంకోసం రూ.1,000కోట్లు, దెబ్బతిన్న రహదారుల మరమ్మతుల కోసం రూ.500కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో 1,883 కి.మీ. రహదారుల నిర్మాణానికి రూ.85,000కోట్ల ఖర్చు తో ప్రాజెక్టులు చేపట్టాలని ప్రతిపాదించగా రాబోయే రెండేళ్లలో రూ.1లక్ష కోట్లు కేటాయించేందుకు కేంద్రం హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతలు కొల్లి బ్రహ్మయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేట మండలం గోనేపూడిలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఎమ్మెల్యే అరవిందబాబు

విద్యార్థులకు పాఠాలు చెప్పిన ఎమ్మెల్యే

నరసరావుపేట రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట మండలంలోని గోనేపూడిలో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులతో సరదాగా ముచ్చటించి, వారికి పాఠాలు చెప్పారు. విద్యార్థులతో మాట్లాడుతూ, తల్లికి వందనం పథకం ద్వారా ప్రభుత్వ సాయం వారి కుటుంబాలకు అందిందా లేదా అని విద్యార్థులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నరసరావుపేటలో అభివృద్ధి పనులు పరిశీలన

నరసరావుపేట టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని అభివృద్ధి పనులను ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు మంగళవారం పరిశీలించారు. బరంపేటలోని విద్యుత్ కార్యాలయం వద్ద నిర్మాణంలో ఉన్న కల్వర్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అధికారులతో సమావేశమై పనుల పురోగతి, నాణ్యతలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సమీపంలో ఉన్న ఓరియంటల్ స్కూల్ వద్ద మైదానం, కాలవల నిర్మాణ పనులను కూడా సందర్శించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను విని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలి

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు అధిక ఆదాయం సాధించడమే లక్ష్యంగా ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఉద్యాన పంట సాగుపై రైతుల్లో అవగాహన పెంపొందించాలని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కోరారు. వినుకొండలో జరగనున్న కిసాన్ మేళా ఏర్పాటుపై మంగళవారం హార్టికల్చర్, ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు సిబ్బందితో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్థిక సంపదను సృష్టించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఉద్యానవన పంట సాగును ప్రోత్సహిస్తున్నారని ఆ దిశగా రైతుల్లో అవగాహన పెంపొందించి ఉద్యాన పంట సాగును పెంచాలని సూచించారు. ఉద్యాన పంటల ద్వారా తక్కువ పెట్టుబడితో రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. రైతు తలసరి ఆదాయం పెంచేందుకు ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుల తలసరి ఆదాయం పెరగటంతో సంపద సృష్టించబడి రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల రైతులకు ప్రభుత్వం సాయం చేస్తుందని, ఉద్యాన శాఖ ద్వారా పండ్లు పూలు తదితర ఉద్యాన పంట సాగుకు రాయితీలు అందిస్తుందని తెలిపారు. ఉద్యాన పంటల సాగుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీ వివరాలను ప్రతి రైతుకు తెలియజేసి ఉద్యాన పంట సాగుకు ప్రోత్సహించి రైతు ఆర్థిక ప్రగతి సాధించేందుకు కృషి చేయాలన్నారు. బహిరంగ మార్కెట్లో డిమాండ్ ఉన్న ఉద్యాన పంటలను సాగు చేసేందుకు రైతును ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, ఉపాధి హామీ, మైక్రో ఇరిగేషన్, ప్రకృతి వ్యవసాయం, సెరీకల్చర్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

రేషన్ షాపుల్లో తనిఖీలు

వినుకొండ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లోని రేషన్ షాపులను తహసీల్దార్ సురేష్‌నాయక్ డీటీతో కలిసి తనిఖీలుచేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయ పరిధిలోని మొత్తం 59 రేషన్‌షాపుల్లో నిత్యం తనిఖీలు జరుగుతుంటాయని, ఎవరైనా రేషన్ షాపు యజమాని లబ్ధిదారులకు సరుకులు ఇవ్వకుండా డబ్బులు చెల్లించినట్లయితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌లకు సర్టిఫికెట్లు అందజేత

నరసరావుపేట టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్‌లకు బీ సర్టిఫికెట్లు ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ మంగళవారం తెలిపారు. ముఖ్యఅతిథిగా 23 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ గోపాల్ త్రిపాఠి, లెఫ్టినెంట్ కల్నల్ ఎన్ఎస్ పరమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

నరసరావుపేట రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలోని రైతులందరూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ నగేష్ తెలిపారు. జొన్నలగడ్డలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులు సాగు చేస్తున్న పత్తి వరి మొక్కజొన్న పంటలను పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ నగేష్ పరిశీలించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు 'తిరుమల' విద్యార్థిని ఎంపిక

నరసరావుపేట రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి యోగా పోటీలలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. ఈ నెల 3వ తేదీన నరసరావుపేట పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో నిర్వహించిన వివిధ కళాశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. తిరుమల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి పి.ఏసు మరియమ్మ ఉత్తమ ప్రదర్శన కనబరిచి ప్రథమస్థానం కైవసం చేసుకుంది. మంగళవారం కళాశాలలో విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ, యోగా అసిస్టెంట్ ప్రొఫెసర్ కే.రంగలక్ష్మి అభినందించారు.

నూతన యాప్‌తో ఉపాధి అక్రమాలకు అడ్డుకట్ట: డ్వామా పీడీ



ఫీల్డ్ అసిస్టెంట్‌లతో మాట్లాడుతున్న డ్వామా పీడీ లింగమూర్తి

శావల్యాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసి మరింత పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో నూతన యాప్‌ను రూపొందించిందని డ్వామా పీడీ సిద్ద లింగమూర్తి అన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌లు పని ప్రదేశాల్లో నూతన యాప్‌లో కూలీల హాజరు, కొలతలు నమోదు చేయాలన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో బొల్లాపల్లి, నూజెండ్ల మండలాల్లోని 64మంది ఫీల్డ్‌అసిస్టెంట్‌లకు ఎన్ఎంఎంఎస్ యాప్‌పై మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీడీ బూసిరెడ్డి, జిల్లా ప్లాంటేషన్ అధికారి శిరీష, ఏపీవో ఆంజనేయరాజు, రిసోర్స్‌పర్సన్‌లు నారాయణ, బేబీరోజ, సోమ్లానాయక్, రమేష్, గురవరావు, గురవారెడ్డి పాల్గొన్నారు.



డీఈ కార్యాలయం వద్ద ధర్నాచేస్తున్న సీపీఐ, సీపీఎం, సీపీఐయూ, సీపీఐఎంఎల్, వామపక్ష నాయకులు

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలంటూ ధర్నా

నరసరావుపేట టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలని, అధికంగా వస్తున్న కరెంట్ చార్జీలు తగ్గించాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. మంగళవారం నరసరావుపేట డీఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ 22, 23 సంవత్సరాల సర్ చార్జీలను, ట్రూ అప్ చార్జీలను, సర్దుబాటు చార్జీలను అన్యాయంగా వసూలు చేయడం వలన ప్రజలు అధిక విద్యుత్ భారాలతో అల్లాడిపోతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సత్యనారాయణరాజు, ఎస్కే చిన్న, జనసేన కోటిరాజు, సీపీఎం ఆంజనేయనాయక్, డీ శివకుమారి, ఎస్కే సిలార్, సీపీఎం ఎంఎల్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో స్మార్ట్ మీటర్లు బిగించవద్దంటూ మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలన్నారు. చెరువు కట్ట సెంటర్ నుంచి కరెంటు ఆఫీసు వరకు ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. సంతకాలతో వినతి పత్రాన్ని విద్యుత్ శాఖ అధికారులకు అందజేశారు.

● వినుకొండ టౌన్: ప్రజలపై మోపుతున్న విద్యుత్ భారాన్ని, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పట్టణంలోని కరెంటు ఆఫీస్ వద్ద సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి తోట ఆంజనేయులు, షేక్ ఫిరోజ్, మునగపాటి ప్రసాద్, కామా వెంకటేశ్వర్లు, ఓబులాపురం ఆంజనేయులు, గుంటి నాగేశ్వరరావు, సుబ్బారావు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురికి తీవ్ర గాయాలు

యడ్లపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పదహారో నంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. చిలకలూరిపేటకు చెందిన ఓ వ్యక్తి రాత్రి 8 గంటల సమయంలో కారులో గుంటూరుకు వెళుతూ యడ్లపాడు పిల్లికొండ సమీపంలో కారును నిలిపి డోరు తీసుకుని కిందకు దిగుతుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న ద్విచక్రవాహనం కారు డ్రైవర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు డ్రైవర్‌తోపాటు ద్విచక్రవాహనంపై వస్తున్న జగ్గాపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారి పూర్తి వివరాలు తెలియరాలేదు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

బొల్లాపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు తక్కువగా ఉండటంతో మంగళవారం రోడ్డుపై వెళ్తున్న ఆవు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. దేవుని ఆవు కావటంతో గ్రామస్థులు తీవ్రంగా కలత చెందారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుకు దగ్గరగా తక్కువ ఎత్తులో ఉండటంతో ఆ వీధిలో వెళ్లే స్కూల్‌కు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులు నిత్యం ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నరసరావుపేట జేఎన్టీయూకు నిధులు మంజూరు చేయాలి: గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ కళాశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పలనాడు జిల్లా వైసీపీ అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కాకాని గ్రామం వద్ద ఉన్న జేఎన్టీయూ కళాశాలను మంగళవారం సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2014 ఫిబ్రవరిలో నరసరావుపేట జేఎన్టీయూ కళాశాల మంజూరైనా 2019లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కళాశాల నిర్మాణం కోసం రూ.150కోట్ల రూపాయలు నిధులు ఖర్చుచేసి పలు నిర్మాణాలు చేపట్టామన్నారు. 2023 ఫిబ్రవరి నుంచి ఇక్కడ తరగతులు ప్రారంభించామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 14 నెలలైనా ఈ కళాశాల అభివృద్ధిపై నిర్లక్ష్యంగా ఉందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు.


చేతిపంపుల మరమ్మతులపై నిర్లక్ష్యం

● ఇబ్బందులు పడుతున్న కారుమంచి వాసులు



కారుమంచిలో మరమ్మతులకు గురైన చేతిపంపు

కారుమంచి (శావల్యాపురం) ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కారుమంచిలో వెంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలోని చేతిపంపు మరమ్మతులకు గురై ఏడాది గడుస్తున్నా అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. చేతిపంపు పనిచేయక పోవడంతో గ్రామంలో పలు కుటుంబాలకు నీరందక ఇక్కట్లు పడుతున్నారు. ప్రభుత్వం విడుదల చేసిన సాగర్ జలాలతో తాగు నీటి చెరువును నింపేందుకు ఇటీవల చెరువులోని నీటిని కూడా బయటకు పంపించటంతో తాగునీటి పథకం నుంచి గ్రామంలోకి తాగునీరు వదలడం లేదు. గ్రామస్థులు నీటికోసం బావులను ఆశ్రయించాల్సి వస్తుందని, తాగునీటిని కూడా కొనుక్కొని తాగాల్సిన దుస్థితి నెలకొందని పలువురు వాపోయారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు రోజూ ఈ మార్గంలో వెళుతూ చూస్తున్నారే తప్ప చేతిపంపునకు మరమ్మతులు మాత్రం చేయించడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి చేతి పంపునకు మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వినుకొండ ఫొటోగ్రాఫర్లు తీసిన ఫొటోలు

వినుకొండ ఫొటోగ్రాఫర్లకు అవార్డులు

వినుకొండ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకలను క్రియేటివ్ కల్చర్ కమిషన్ గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫొటో కాంటెస్టు నిర్వహించారు. కాంటెస్ట్‌లో వినుకొండకు చెందిన ఫొటోగ్రాఫర్స్ వంగపల్లి బ్రహ్మయ్య, కేసానుపల్లి సుబ్బారావులు ట్రైబల్ ఫొటో ఆఫ్ ది ఇయర్ 2025 అవార్డుకు ఎంపికయ్యారు. వంగపల్లి బ్రహ్మయ్య తీసిన హ్యాపీనెస్ అనే చిత్రం అవార్డుకి ఎంపిక కాగా కేసానుపల్లి సుబ్బారావు తీసిన వాటర్ క్యారీ ఛాయాచిత్రానికి అవార్డు లభించినట్లు తెలిపారు. ఈ నెల 18న విజయవాడలో ఈ అవార్డులు అందుకోనున్నట్లు వారు తెలిపారు.

బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

వినుకొండ, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 3న నిర్వహించిన సబ్ జూనియర్, జూనియర్ బాల, బాలికల ఎంపికల్లో పట్టణంలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎం.గౌతమ్, బి.వెంకటేశ్వర్లు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. వీరు ఈ నెల 29న ప్రకాశం జిల్లా గుడ్లూరు మండలం చేవూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకటేశ్వరప్రసాద్, పీఈటీ జోనానాయక్, ఏటీపీ ఎస్కే ఖాశీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి

ప్రకృతి వ్యవసాయంతో భూమి ఆరోగ్యంగా ఉంటుంది

● జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి

ఈపూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో భూమి ఆరోగ్యంగా ఉండడంతోపాటు నాణ్యమైన పంట దిగుబడి సాధించవచ్చునని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే అమలకుమారి అన్నారు. ఈపూరు రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై బొల్లాపల్లి, ఈపూరు, శావల్యాపురం వీఏఏ, వీహెచ్ఏలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ రసాయనాలు వాడటం వలన భూమి సారవంతం కోల్పోయి ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వలన భూసారం పెరిగి నీటి నిల్వ సామర్థ్యం మెరుగుపడుతుందన్నారు.కార్యక్రమంలో ఏడీఏలు రవికుమార్, హనుమంతురావు, మండల వ్యవసాయాధికారి రామారావు, ప్రకృతి వ్యవసాయ జిల్లా శిక్షకుడు సైదయ్య, డివిజన్ ఎంటీ తిరుపతిరావు, డీటీటీ శివలక్ష్మి, యూనిట్ ఇంచార్జి ఆంజనేయులు, లక్ష్మణనాయక్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన డీవైఈవో

నాదెండ్ల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనపర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీవైఈవో షేక్ మహబూబ్ సుభానీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. రాబోయే రాబోయే 10వ తరగతి పరీక్షల్లో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించేలా చదవాలని సూచించారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం

చిలకలూరిపేట, ఆగస్టు5 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ పండరిపురం వారి ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు బోనం వెంకటేశ్వరరావు అధ్యక్షతన ప్రశాంతి వృద్ధాశ్రమంలో మంగళవారం 20మంది వృద్ధులకు, గణపవరంలోని తులసి వనం వృద్ధాశ్రమములో 40మంది వృద్ధులకు అన్నదానం చేశారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ జానీబాషా తల్లిదండ్రుల వర్థంతి సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ కార్యదర్శి డి.మనోజు, కోశాధికారి జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన

చిలకలూరిపేట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మంగళవారం జర్నలిస్టులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అక్రిడేషన్, హెల్త్ స్కీమ్ సమస్యలను తక్షణం పరిష్కరించాలని వారు డిమాండ్ చేసి, వినతిపత్రం అందజేశారు.